

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

పాత జెండా మారుస్తున్నారు

'చిరిగిన జెండాకి వందన మెలా?' అంటూ తిరుపతి ఆర్టీసీ బస్టాండు సమీపంలో సుబ్బలక్ష్మి విగ్రహం కూడలిలోని భారీ జాతీయ జెండా చిరిగి పేలికలవడాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించింది. దీంతో మంగళవారం పాత జెండాను తొలగించారు. దీని స్థానంలో కొత్త జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేయనున్నారు.

హ్యాపీ ఎలిఫెంట్స్ డే



గజరాజు ఆశీర్వాదం

ఏనుగుల దినోత్సవం సందర్భంగా సినీనటి, మిస్ ఇండియా-2020 విజేత మానస వారణాశి మంగళవారం ఉదయం తిరుమల గోశాలకు చేరుకున్నారు. ఏనుగుల ఆశీర్వాదం తీసుకున్నారు. అంతకుముందు ఆమె వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే, మిస్ ఎర్త్ 2019 డాక్టర్ తేజస్విని మనోజ్ఞ కూడా సాయంత్రం శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఏనుగుల కడుపు నింపగా..

తిరుపతి ఎస్వీ జూ పార్కులో మంగళవారం ఏనుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తాజా పండ్లు, కూరగాయలను వాటికి ఆహారంగా అందించారు. ఏనుగుల సంరక్షణపై వీరికి అధికారులు అవగాహన కల్పించారు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. సబ్ డీఎఫ్‌వో నాగభూషణం, రేంజ్ ఆఫీసర్ జగదీష్, ఎడ్యుకేషన్ ఆఫీసర్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(మంగళం), ఆంధ్రజ్యోతి





సంతతి పెరుగుతోంది

ఏనుగుల సంతతి పెరుగుతోందని అధికారులు అంటున్నారు. అందుకు నిదర్శనం తిరుమలలోని ఎర్ర మట్టి దిబ్బల వద్ద ఏనుగు పిల్లలు జలకాలాడుతూ కెమెరాకు చిక్కాయంటూ మంగళవారం ఫొటో విడుదల చేశారు. ఏనుగుల గుంపు దగ్గరక వెళ్లడం, ఫొటోలు తీయడం, సెల్ఫీ ప్రయత్నాలు చేయొద్దన్నారు. చీకటి పడ్డాక పొలాల్లోకి వెళ్లొద్దని అటవీ సమీప రైతులకు సూచించారు.

- తిరుపతి(మంగళం), ఆంధ్రజ్యోతి

షార్‌లో కరపత్రాల కలకలం

● ఉద్యోగులను వేధిస్తున్నారంటూ ప్రచారం

సూళ్లూరుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం(షార్)లో ఓ సీనియర్ ఉద్యోగి తన తోటి ఉద్యోగులను వేధించి బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ గుర్తు తెలియని వ్యక్తులు కరపత్రాలను వేయడం మంగళవారం కలకలం రేపింది. ఉద్యోగంతో పాటు అసోసియేషన్ సభ్యుడిగా ఉంటూ పాఠశాలలో మహిళ ఉద్యోగులను కూడా లైంగికంగా వేధిస్తున్నారంటూ కరపత్రాల్లో ప్రస్తావించారు. ఆరేళ్లుగా సేవా ముసుగులో వినాయకచవితి చందాలు కూడా వసూలు చేశారని, రియల్ ఎస్టేట్ పేరిట టోకరా వేస్తున్నారంటూ రెండు పేజీల ఆంగ్ల కరపత్రంలో ఆరోపణలు గుప్పించారు. షార్ సెంటర్‌తో పాటు సూళ్లూరుపేటలో కూడా అక్కడక్కడా ఇవి చక్కర్లు కొట్టాయి. కేఆర్‌పాలెం సమీపంలో షార్ ట్రాన్స్‌పోర్టు యాడ్ వద్ద కట్టలుగా పడివున్న కరపత్రాలను షార్ ఉన్నతాధికారులు స్వాధీనం చేసుకొన్నట్లు తెలిసింది. విషయాన్ని బయటకు పొక్కనీయకుండా అలర్ట్ అయ్యారు. వెనువెంటనే వాటిని కనబడనీయకుండా తీసుకెళ్లారు.

సీఎం ప్రారంభించాకనే 'ఉచిత ప్రయాణం'

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మరో రెండు రోజుల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమల్లోకి రానుంది. శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అలాగని, శుక్రవారం వేకువజామున ఫస్ట్ బస్సు నుంచే ఉచిత ప్రయాణం సాధ్యం కాదు. ఆ రోజు సీఎం చంద్రబాబు ఏ సమయానికి ప్రారంభిస్తారో.. అప్పటి నుంచే టిక్కెట్స్ జారీచేసే టిమ్స్‌కు గ్రీన్ సిగ్నల్ వస్తుంది. ఈ విషయాన్ని మహిళలు గుర్తుపెట్టుకోవాలని అధికారులు చెబుతున్నారు.

జీరో టికెట్ సిద్ధం

పుత్తూరు,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం కింద ఉచిత ప్రయాణానికి సంబంధించి జీరో టిక్కెట్ జారీకి టిమ్స్‌లలో ఇప్పటికే సాంకేతిక పరిజ్ఞానం పొందుపరిచారు.దీనిపై కండక్టర్లకు శిక్షణ ఇచ్చారు.పుత్తూరు డిపోలో 80 బస్సులు ఉండగా 55బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతించనున్నారు.డిపో సర్వీసుల్లో ప్రతి రోజు 3500 మంది మహిళలు ప్రయాణిస్తుండగా ఉచిత ప్రయాణంతో మరో 20 శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



ప్రాణాలను నిలబెడదాం

● అవయవదానంతో మరికొందరికి పునర్జన్మ

8

● పోలీసుల నిర్లక్ష్యమూ కనిపిస్తోంది

రాతియుగాన్ని తలపించేలా..!

పవన్‌పై దాడి చేసిన నిందితులు

రుయాలో బాధితుడిని పరామర్శించిన ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాతియుగాన్ని తలపించేలా కొందరు కలిసి దళిత యువకుడైన పవన్‌పై విచక్షణారహితంగా దాడి చేయడం దురదృష్టకరమని ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ అన్నారు. దీనికి ప్రత్యక్షంగా, పరోక్షంగా బాధ్యులైన ప్రతి ఒక్కరిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. వైసీపీ నేతల దాడిలో గాయపడి తిరుపతిలోని రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌కుమార్‌ను మంగళవారం ఆయన పరామర్శించారు. దాడికి గల కారణాలను, నిందితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అట్రాసిటీ చట్టం ప్రకారం ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రాయితీలను అందిస్తామన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పవన్‌కుమార్‌పై 25 మందికి పైగా దాడికి పాల్పడగా, వీరిలో 16 మందిని గుర్తించి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు చెబుతున్నారన్నారు. వీరిలో కొందరిని అదుపులోకి కూడా తీసుకున్నారన్నారు. తిరుపతి వంటి పుణ్యక్షేత్రంలో ఇటువంటి ఘటన జరగడం బాధాకరమన్నారు. ఇప్పటికే ఎస్పీతో మాట్లాడి బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. కర్రలు, లాఠీలతోనే కాకుండా బూటు కాలుతో తన్నిన గాయాలు ఇంకా ఉన్నాయన్నారు. ఎవరి అండతో దాడికి పాల్పడ్డారనేది బయటకు వస్తాయన్నారు. అవసరమైతే ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి త్వరితగతిన నిందితులపై చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. ఇంకా అట్రాసిటీ చట్టాలను ఉల్లంఘిస్తూ దళితులపై దాడులకు తెగబడుతున్న వారికి గుణపాఠం చెప్పేలా చట్టాలను కఠినంగా అమలు చేస్తామన్నారు. పవన్‌కుమార్‌పై దాడి వీడియో బయటకు వచ్చిన వెంటనే పోలీసులు స్పందించి ఉంటే అదేరోజు పవన్‌కుమార్‌ను గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకునే అవకాశం ఉండేదని ఆయన అభిప్రాయపడ్డారు. బాధితుడిని బెదిరించి మరో వీడియో తీసే అవకాశం ఉండేది కాదన్నారు. ఈ విషయంలో పోలీసుల నిర్లక్ష్యంగా కూడా కనిపిస్తోందని ఆరోపించారు. బాధితుడిని దాచిపెట్టిన ఇంటిని కూడా వేలం వేసి ఆ నగదును బాధితుడికి ఇచ్చేలా విధంగా చర్యలు చేపడతామన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, మాజీ మంత్రి పరసారత్నం, నేతలు సూరజ్, శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.



జవహర్‌కు దెబ్బలు చూపిస్తున్న పవన్ కుమార్



వెయ్యి అడుగుల జెండా



తిరుపతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): 'హర్‌ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం తిరుపతిలో వెయ్యి అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. కార్పొరేషన్, టూరిజం, ఎస్వీ యునివర్సిటీ సంయుక్తంగా మహతి నుంచి ఎస్వీయూ స్టేడియం వరకు ఈ ర్యాలీ సాగింది. 'ప్రతి ఇంట్లో జెండా ఎగురవేసేలా ప్రోత్సహించడానికి రెండు వారాల కార్యక్రమం రూపకల్పన చేశాం. సెల్ఫీ పాయింట్ వద్ద సెల్ఫీ దిగి అప్లోడ్ చేస్తే సర్టిఫికెట్ ఇస్తారు. దేశభక్తిని ఒక రోజుకే పరిమితం చేయకుండా, ప్రతి రోజూ మన పనుల్లో ఆ స్ఫూర్తి కనిపించేలా ఉండాలి. మన పరిసరాలను, నగరాన్ని శుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత. యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి' అని కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య పిలుపునిచ్చారు. ఎస్వీయూ వీసీ అప్పారావు, ఏపీ జీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, వూకా విజయ్ కుమార్, టూరిజం ఆర్డీ రమణ ప్రసాద్, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి జనార్దన్‌రెడ్డి, కార్పొరేటర్లు నరసింహ ఆచారి, నరేంద్ర, రేవతి, కాంచన, కుమారి, అన్నా అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన కమల వికాసం

● ప్రజాసమస్యల పరిష్కారానికి వారధిగా ఉండాలి

● సారథ్యం సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పిలుపు



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గ్రామగ్రామాన కమల వికాసం జరిగేలా కృషి చేయాలని నేతలు, శ్రేణులకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న ఆయన 'సారథ్యం' పేరిట జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం తిరుపతిలో జరిగిన సారథ్యం కార్యక్రమానికి మాధవ్ హాజరయ్యారు. ప్రజాసమస్యల పరిష్కారానికి వారధులుగా ఉండాలని శ్రేణులకు సూచించారు. జిల్లాలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచి, ఎంపీటీసీ, కౌన్సిలర్.. ఇలా ఏ అవకాశం వచ్చినా పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఇకపై నామినేటెడ్ పోస్టులకూ సర్దుబాటు చేసుకుంటామని తెలిపారు. టీటీడీ ఉద్యోగుల్లోని అన్యమతస్థులను వేరే సంస్థలకు పంపించాలని డిమాండు చేశారు. అంతకుముందు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా ఆనంద్ మాట్లాడుతూ, కూటమి ఎమ్మెల్యేలు బీజేపీ నాయకులను పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యేల తీరుతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇకపై ఎక్కువ సమయం తిరుపతి లోక్‌సభ నియోజకవర్గంపై దృష్టి పెట్టాలని మాజీ ఎంపీ వరప్రసాద్‌ను కోలా ఆనంద్ కోరారు. నియోజకవర్గంలో తాను తిరిగినట్టు మరొక ఎంపీ, ఎంపీ అభ్యర్థి తిరగలేదని వరప్రసాద్ అన్నారు. అలాకాదని నిరూపిస్తే రాజకీయాలనుంచి విరమించుకుంటానని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, జల్లి మధుసూదన్, పార్థసారధి, బీడీ బాలాజీ, చంద్రప్ప, శాంతారెడ్డి, చంద్రారెడ్డి, ఎస్ఎస్ నాయుడు, కంద్రిగ ఉమ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు లక్ష్మీపురం సర్కిల్లోని శంకరంబాడి సుందరాచారి విగ్రహానికి మాధవ్, నేతలు పుష్పాంజలి ఘటించారు. సారథ్యం కార్యక్రమంలో భాగంగా లీలామహల్ సర్కిల్ నుంచి కచ్చపి ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇక, ఉదయం 'చాయ్ పే చర్చ' కార్యక్రమంలో భాగంగా సామంచి శ్రీనివాస్‌తో కలిసి బైక్‌పై మాధవ్ తిరుపతిలో పర్యటించారు. బాబూ జగ్జీవన్‌రామ్ పార్క్ పరిసర ప్రాంతాల్లో పాదచారులతో మాట్లాడారు. నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి వివరాలు తెలుసుకున్నారు. సిటీ బస్సులు నడపాలని, యూడీఎస్ మెరుగు పరచాలని పలువురు ఆయనకు సూచించారు.



జ్యోతిప్రజ్వలన చేసి బీజేపీ విస్తృతస్థాయి సమావేశాన్ని ప్రారంభిస్తున్న మాధవ్

మేధావుల సదస్సు : కాగా, సోమవారం రాత్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాపారుల, మేధావుల సదస్సులో మాధవ్ పాల్గొన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయన్నారు. పారిశ్రామికవేత్తలకు కేంద్రం రాయితీలు ఇస్తోందని, అందరూ ముందుకు వచ్చి రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. పారిశ్రామికవేత్త పృధ్వీరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్ అసోసియేషన్, ఆటోమొబైల్ అసోసియేషన్, క్రెడాయ్ ప్రతినిధులు, బిల్డర్లు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో 'స్మార్ట్' నిధుల దుర్వినియోగం

● బోగస్ ఓట్ల విషయమై కేంద్రాన్ని అడిగి తెలుసుకుంటా

● మీడియా చిట్‌చాట్‌లో బీజేపీ అధ్యక్షుడు మాధవ్

తిరుపతి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించడమే కాదు.. కేంద్రం ఇచ్చిన స్మార్ట్ సిటీ నిధులనూ దుర్వినియోగం చేశారని బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆరోపించారు. తిరుపతిలో మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. 'స్మార్ట్ సిటీ నిధులను ఇతర పనులకు వాడేశారు. చాలాచోట్ల దుర్వినియోగం చేశారు. కేంద్ర ప్రభుత్వం గైడ్‌లైన్స్ కఠినంగా పెట్టినా వైసీపీ లెక్కపెట్టలేదు. రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంటునూ ఇవ్వడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. ఈసారి స్మార్ట్‌సిటీలకు ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం అమృత్2.0 తీసుకొచ్చింది' అని వివరించారు. గత ప్రభుత్వంలో వైద్యశాఖలోనూ పెద్దఎత్తున గోల్‌మాల్ జరిగిందన్నారు. నైట్ ల్యాండింగ్ సౌకర్యం లేకపోవడం, అధికారుల నియామకాలు జరిగితే విదేశీ విమాన రాకపోకలు జరగొచ్చు. తిరుపతి మీదుగా తిరువణ్ణామలైకి రైలు సౌకర్యంపైనా ప్రయత్నిస్తా'నని చెప్పారు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక సందర్భంగా 35 వేల బోగస్ ఓట్లు ఎక్కించిన కేసు ఇప్పటికీ విచారణలోనే ఉండడం వెనుక కేంద్ర ప్రభుత్వం వైసీపీకి అనుకూలంగా ఉందన్న ప్రచారం జరుగుతోందన్న మీడియా ప్రశ్నకు మాధవ్ స్పందించారు. ఈకేసు విషయం తన దృష్టికీ వచ్చిందని, పూర్వాపరాల గురించి కేంద్రాన్ని అడిగి తెలుసుకుంటానన్నారు. తన పర్యటన సందర్భంగా కేడర్‌లో నూతనోత్సాహం కనిపిస్తోందన్నారు.

రూ.11.50 కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు


కల్‌రోడ్డుపల్లెలో సమస్యలను వింటున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):కల్‌రోడ్డు పల్లె, ఎం.కొంగరవారిపల్లె పంచాయతీలో ఎమ్మెల్యే పులివర్తి నాని మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రెండు పంచాయతీల్లో రూ.11.50 కోట్లతో 80 అభివృద్ధి పనులకు ప్రతిపాదించామన్నారు. మండలంలోని మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పనలో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో సుమారు 600 కుట్టు మిషన్లను అందజేశామన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించమన్నారు. మండలం పరిధిలో అన్నదాత సుఖీభవ పథకం కింద 4504 రైతులకు సుమారు రూ.2.94 కోట్లు జమచేశామన్నారు. అనంతరం కల్‌రోడ్డు పల్లె, ఎం.కొంగరవారిపల్లె పంచాయతీలోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలను స్వీకరించారు. డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యంనాయుడు, ఎంపీడీవో వెంకటరత్నం, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఏఎంసీ ఛైర్మన్ గౌస్‌బాషా, తుడా మాజీ డైరెక్టర్ బాలకృష్ణమూర్తి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రపంచస్థాయి మ్యూజియంగా అభివృద్ధి చేయండి


సమీక్షిస్తున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనుల పురోగతిపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం సాయంత్రం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సివిల్, ఎలక్ట్రికల్, ఇంజినీరింగ్ పనులు, మ్యూజియం గైడ్స్, భద్రత, పారిశుధ్యం, ఇతర సౌకర్యాలను ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్ది ప్రపంచస్థాయి ఆధునిక మ్యూజియంగా అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. పనులు నిర్దేశిత గడువులోపు పూర్తిచేయాలన్నారు. ఇన్‌ఛార్జ్ చీఫ్ మ్యూజియం ఆఫీసర్ సోమన్నారాయణ, ఇంజినీరింగ్, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా అరెస్టు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ హుస్సేన్ బాషా

చిట్టమూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి, అల్యూమినియం తీగలను ఎత్తుకెళ్లే ముఠాను అరెస్టు చేసినట్లు వాకాడు సీఐ హుస్సేన్ బాషా తెలిపారు. చిట్టమూరులో మీడియాకు వివరాలు వెల్లడించారు. మంగళవారం చిట్టమూరు ఎస్ఐ చిన్న బలరామయ్య ఆధ్వర్యంలో పోలీసులు మండల పరిధిలోని కలుగుర్తిపాడు వద్ద అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో రాగి, అల్యూమినియం తీగలు ఉండడంతో ఆ వాహనంలో ప్రయాణిస్తున్న వారిని అదుపులోకి తీసు కుని ప్రశ్నించారు. మండలంలోని ఆరూరు అరుందతివాడకు చెందిన గంగిపంగి వెంకటేష్, యర్రబల్లి పోలయ్య, కంటేపల్లి కోటేశ్వరావు, కంటేపల్లి సుబ్బయ్య, కంటేపల్లి గిరిబాబు ముఠాగా ఏర్పడి రొయ్యల చెరువుల వద్ద, వ్యవసాయ పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులో ఉన్న రాగి, అల్యూమినియం తీగలను చోరీ చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు వీరు చిట్టమూరు, కోట, వాకాడు, దొరవారిసత్రం మండలాల్లో 38 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి, అల్యూమినియం తీగలను ఎత్తుకెళ్లారు. వాహనంతో పాటు 175 కిలోల రాగి, 338 కిలోలు అల్యూమినియం తీగలను స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోట కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ హుస్సేన్ భాషా తెలిపారు.

అంబరాన్నంటిన జాతర సంబరం


సారె సమర్పించడానికి వస్తున్న ఎమ్మెల్యే

రేణిగుంట ఆగస్టు 12(ఆంధ్ర జ్యోతి): భక్తుల కోరిక తీర్చే గంగమ్మ తల్లి జాతర అంబరాన్నం టింది. మంగళవారం రేణిగుంట గంగమ్మ జాత రని పురస్కరించుకుని పట్టణవాసులు ఆలయానికి పోటెత్తారు. ఉదయం ఇళ్ల వద్ద అంబళ్లు పోశారు. నడివీధి త్రిశూలం వద్ద గంగమ్మకు నైవేద్యం సమర్పించారు. రాత్రి వరకు భక్తులు గంగమ్మ ఆలయానికి చేరుకుని పొంగలి వండి అమ్మవారికి సమర్పించారు. ఇక పట్టణంలో ఎక్కడ చూసినా జాతర సందడి కనిపించింది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గంగమ్మను ఎమ్మెల్యే సుధీర్, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం దర్శించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరా ద్వారా పోలీసులు పర్యవేక్షించారు.

అనారోగ్యంతో ఇరిగేషన్ ఏఈ మృతి

ఏర్పేడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేట ఇరిగేషన్ సెక్షన్ ఏఈ చినబాబు (55) మంగళవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చినబాబు చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందారు.

శివపార్వతులకు ఉత్సవ గొడుగుల వితరణ

శ్రీకాళహస్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వ రుడికి ఉత్సవ గొడుగులను తమిళనాడుకు చెందిన శ్రీమత్ రామానుజ కైంకర్య ట్రస్టు నిర్వాహకులు వితరణ చేశారు. ఈ మేరకు మంగళవారం గొడుగులను మంగళవారం ఎమ్మెల్యే సుధీర్‌కి అందజేశారు. ఇంకా ఆలయ అధికారులు కొలతల వివరాలు ఇస్తే పరివార దేవతామూర్తులకు సైతం గొడుగులు అందజేస్తామన్నారు.

మా బడి మాకే కావాలి


ఎంఈవో కార్యాలయం వద్ద విద్యార్థుల ధర్నా

కేవీబీపురం, ఆగస్టు 12 (ఆంధ్ర జ్యోతి) అనంతపద్మనాభపురం, బంగారమ్మ కండ్రిగ, జ్ఞా నాంబకండ్రిగ, పాతపాళెం గ్రామాలకు చెందిన విద్యార్థులు, వారి తల్లి దండ్రులు మంగళవారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం వద్ద తమ బడి తమకే కావాలని ధర్నా నిర్వహించారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలు 3-4కిలోమీటర్లు దూరం నడిచి వెళ్లి రాలేరని ఇప్పటికే పాఠశాలలు తెరిచి 60 రోజులు గడుస్తున్నా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. స్థానిక విద్యాశాఖాధికారులకు ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలు తాము అమలు చేస్తున్నామని చెప్పినా తల్లిదండ్రులు వినడం లేదన్నారు.

సమస్యల పరిష్కారానికి ధర్నా



పుత్తూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలంటూ పుత్తూరు ఆర్టీసీ డిపో గ్యారేజీ ఎదుట మంగళ వారం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని వాపోయారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో సిబ్బందికి కలిగే ఇబ్బందులను పట్టించుకోలేదని, విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకే అప్పజెప్పాలని, డీఏలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పీఆర్సీ కారుణ్య నియామకాలు తదితరాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్ముగం, పెరుమాళ్, సుందరం పాల్గొన్నారు.

రేపు పోటీపరీక్షలపై ఉచిత సదస్సు

తిరుపతి రూరల్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ఎంఆర్ పల్లె సర్కిల్‌లోని కౌటిల్య ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం సాయంత్రం 6గంటలకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, పలు పోటీపరీక్షలకు సంబంధించి ఉచిత అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. ముఖ్యవక్తగా ప్రముఖ వ్యక్తిత్వవికాస నిపుణులు యండమూరి వీరేంద్రనాథ్ హాజరు కానున్నారని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్ కోర్సులు చదివే విద్యార్థులు వారి తల్లిదండ్రులు హాజరై సందేహాలని నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. వివరాలకోసం 9698123456, 0877-2222212 ఫోన్‌నెంబర్లని సంప్రదించి ఉచితంగా నమోదు చేసుకోవాలని కోరారు.

డెయిరీ టెక్నాలజీలో రైతు కోటా సీట్ల దరఖాస్తుకు గడువు

తిరుపతిరూరల్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని డెయిరీ టెక్నాలజీ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి బీటెక్ కోర్సుల్లో రైతుకోటా సీట్ల దరఖాస్తుకు గడువు బుధవారంతో ముగియనుంది. డెయిరీటెక్నాలజీ కళాశాల డీన్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు ఈమేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీఈఏపీసెట్‌లో అర్హత సాధించిన ఈ కోటాలో ఆరు సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థి తల్లి లేదా తండ్రి పేరుమీద కనీసం ఎకరా పొలం ఉన్న రైతుకుటుంబాల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేటప్పుడు అడంగల్/పట్టాదారు పాసుపుస్తకం నకలు కాపీని జతపరచాలని సూచించారు. ఒకటి నుంచి ఇంటర్ వరకు నాలుగు సంవత్సరాల పాటు నాన్‌మున్సిపల్ ఏరియాలో చదివిన వారు అర్హులన్నారు. ఇతరవివరాలకోసం ఎస్వీవీయూ.ఈడీయూ.ఇన్ వెబ్‌సైట్‌నిగానీ లేదా 9989777373, 7989656956 ఫోన్‌నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఓటేరులో రెండు ఆవుల చోరీ


తల్లులను వాహనంలో తీసుకెళ్తుంటే వెంబడిస్తున్న దూడలు(సీసీ ఫుటేజి చిత్రం)

తిరుపతి రూరల్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ఓటేరులో రెండు ఆవులను సోమవారం అర్ధరాత్రి దుండగులు చోరీ చేసి తీసుకుపోయారు. తల్లి ఆవులను బలవంతంగా తీసుకెళ్తుండగా రెండు దూడలు ఆ వాహనాన్ని కొంతదూరం వరకు వెంబడించినట్లు సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా గుర్తించామంటున్నారు. వీటి విలువ దాదాపు రూ.1.50లక్షలవరకు ఉంటుందని ఆవుల యజమాని సూర్యకిరణ్ ఎంఆర్‌పల్లె రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. గ్రామంలో ఆవుల చోరీ పరిపాటిగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు.

భక్తుల మొబైల్ ఫోన్ల అప్పగింత

● నిందితుల అరెస్ట్



పోగొట్టుకున్న ఫోన్లను భక్తులకు అప్పగిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 12(ఆంధ్ర జ్యోతి): శ్రీవారి పాదాల చెంత దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. తాజాగా మంగళవారం కపిలతీర్థం కోనేరులో భక్తులు స్నానాలు చేస్తుండగా వారి బ్యాగులను ఎత్తుకుపోయారు. భక్తులు స్నానానికి వెళ్లే ముందు తమ బ్యాగుల్లో నాలుగు సెల్ ఫోన్లు, డబ్బు పెట్టారు. స్నానాలు చేశాక వచ్చి చూస్తే బ్యాగులు కనిపించలేదు. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలిపిరి సీఐ రాంకిషోర్ ఆధ్వర్యంలో ఎస్ఐలు నాగార్జునరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరెడ్డి, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అక్కడే వున్న మొబైల్ ఫోన్ల దొంగలను గుర్తించారు. వారి నుంచి నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని భక్తులకు అప్పగించారు. నిందితులను అరెస్టు చేశారు.

కలెక్టర్‌తో ఎమ్మెల్యే నాని భేటీ

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్ వెంకటేశ్వర్‌తో ఎమ్మెల్యే పులివర్తి నాని చర్చించారు.

వెటర్నరీ రిజిస్ట్రార్‌గా వినూ బాధ్యతల స్వీకారం


వినూను అభినందిస్తున్న బోధనేతర ఉద్యోగులు

తిరుపతిరూరల్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ తాత్కాలిక రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ ఆర్.వినూ మంగళవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఈయన్ను వర్సిటీ అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, నాన్‌టీచింగ్ సెంట్రల్ అసోసియేషన్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. బోధనేతర ఉద్యోగసంఘ నాయకులు సి.నాగరాజు, బి.బాలకార్తీక్, బి.మహేష్, సి.మునీంద్రారెడ్డి, కె.మహేంద్రయ్య, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గోకులం..పాడి రైతులకు వరం

● ప్రకృతి విపత్తుల నుంచి పశువులకు రక్షణ ● 90 శాతం సబ్సిడీతో నిర్మాణాలు



భాకరాపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గోకులం పథకం పాడి రైతులకు వరంగా మారింది. మండలంలో అనేక మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం గోకులం పథకం కింద మినీ షెడ్డు నిర్మాణాలు చేపట్టింది. తరువాత వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని అటకెక్కించింది. షెడ్ల నిర్మాణాలకు నిధులు విడుదల కాకపోవడంతో లబ్ధిదారులు ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం గోకులం పథకం పునరుద్ధరించింది. నిర్మాణాలు చేపట్టింది. పశుపోషకులకు 90 శాతం సబ్సిడీ, జీవాలు, కోళ్ల పెంపకందారులకు 70 శాతం సబ్సిడీతో షెడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తోంది. చిన్నగొట్టిగల్లు మండలంలో ఇప్పటివరకు 272 గోకులం షెడ్లు మంజూరు 245 నిర్మాణాలు పూర్తయ్యాయి. తొలివిడత బిల్లులు కూడా లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. ఎమ్మెల్యే నాని ఈ విషయంలో చొరవ తీసుకున్నారు. పెద్దఎత్తున గోకులాలు మంజూరు చేయించారు.

● రెండు ఆవుల యూనిట్ విలువ రూ.1.15 లక్షలు. ఉపాధి హామీ నిధులు రూ.1.03 లక్షలు, రైతు వాటా రూ.11,500 ● 4 ఆవుల విలువ రూ.1.85 లక్షలు. ఉపాధి హామీ నిధులు రూ.1.66 లక్షలు, రైతు వాటా రూ.18,500 ● 6 ఆవుల యూనిట్ రూ.2.30 లక్షలు. ఉపాధి నిధులు రూ.2.07 లక్షలు, రైతు వాటా రూ.23 వేలు ● 20 జీవాల యూనిట్ రూ.1.30 లక్షలు. ఉపాధి నిధులు రూ.91 వేలు, రైతు వాటా రూ.39వేలు ● 50 జీవాకు రూ.2.30 లక్షలు, ఉపాధి నిధులు రూ.1.61 లక్షలు, రైతు వాటా రూ.69 వేలు ● వంద కోళ్ల యూనిట్ రూ.87 వేలు. ఉపాధి నిధులు రూ.61 వేలు, రైతు వాటా రూ.26 వేలు.

పాడి రైతులకు చేయూత



పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చేయూతనిస్తోంది. ప్రకృతి విపత్తల నుంచి పశు సంపదను కాపాడుకోవడానికి గోకులాలు ఉపయోగపడతాయి.

-నరేంద్ర, రాజువారిపల్లె

పాడి రైతులకు చేయూత




పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోంది. ప్రకృతి విపత్తల నుంచి పశు సంపదను కాపాడుకోవడానికి మాలాంటి వారికి గోకులాలు ఉపయోగపడతాయి.

- గంగయ్య, చిన్నగొట్టిగల్లు

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ


ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని



పాకాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వళ్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఈనెల 17వరకూ వైభవంగా జరగనున్నాయి. తొలిరోజు ఉదయం అక్కగార్లపూజ, సాయంత్రం గణపతి పూజ, కంకణధారణ, పుణ్యాహవాచనం, వాస్తు శాంతి, అంకురార్పణం, కలశ స్థాపన హోమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి మూషిక వాహనంపై వినాయక స్వామివారి ఊరేగుతారు. గురువారం ఉదయం ధ్వజారోహణం, యాగపూజ, రాత్రి నందివాహనంపై పార్వతీ పరమేశ్వరుల ఊరేగుతారు. శుక్రవారం ఉదయం యాగపూజ, భరణీ అభిషేకం, షణ్ముఖ సహస్ర నామార్చన, మహా మంగళ హారతి, కాణిపాక వరసిద్ధి వినాయక ఆలయం నుంచి ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ తీసుకొచ్చిన పట్టువస్త్రాలను ఎమ్మెల్యే పులివర్తి నాని చేతులమీదుగా సమర్పించనున్నారు. సాయంత్రం భరణీ దీపోత్సవం, రాత్రి నెమలివాహనంపై సుబ్రమణ్యస్వామివారి ఊరేగింపు ఉంటుంది. శనివారం ఆడికృత్తిక పురస్కరించుకొని తరలివచ్చే భక్తుల కోసం ఎమ్మెల్యే నాని ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు వేశారు. ఆలయ పరిసరాల్లో ప్రత్యేక విద్యుద్దీప, పుష్పాలంకరణలు చేశారు. టీడీపీ ఆధ్వర్యంలో ఐదు రోజులూ అన్న ప్రసాదాలు అందజేయనున్నారు.స్వామివారి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ చైర్మెన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు కార్యనిర్వహణ అధికారి యువరాణి, ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

శెట్టిపల్లి భూముల సమస్యకు త్వరలో పరిష్కారం

● డిజైనింగ్, మ్యాపింగ్ పూర్తి ● కలెక్టర్ వెంకటేశ్వర్, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి


మ్యాపులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంటేశ్వర్, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తదితరులు

తిరుపతి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి భూముల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. మంగళవారం తుడా కార్యాలయంలో శెట్టిపల్లి భూముల సమస్యలపై తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా శెట్టిపల్లి భూముల రైతులు, ప్లాట్ల కొనుగోలుదారులు కలెక్టర్‌ను, తుడా ఛైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శెట్టిపల్లి భూముల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని కలెక్టర్ తెలిపారు. శెట్టిపల్లి భూములపై ఇప్పటివరకు 60కి పైగా కేసులు నమోదయ్యాయని, అయినా కూడా ప్రజా ప్రయోజనం దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళుతున్నామని వివరించారు. తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి కూడా శెట్టిపల్లి భూముల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. వీలైనంత త్వరగా రైతులకు, ప్లాట్ కొనుగోలుదారులకు భూములను అప్పగించనున్నట్లు ఆయన చెప్పారు. తుడా ఛైర్మన్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పరిష్కారం కానీ శెట్టిపల్లి భూముల సమస్య తన మొదటి అజెండాగా తీసుకొని తుడా ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి తోను, జిల్లా ఇన్‌చార్జి మంత్రితో చర్చించి ఒక కొలిక్కి తీసుకువచ్చామని తెలిపారు. ఇప్పటికే భూముల మ్యాపింగ్, డిజైనింగ్ పూర్తి చేశామని, కార్పొరేషన్ నుంచి తుడాకు శెట్టిపల్లి భూముల ఫైల్ బదిలీ అయిన వెంటనే ప్రభుత్వ అనుమతితో భూములను లబ్ధిదారులకు అందించనున్నట్లు హామీ ఇచ్చారు. తుడా కార్యదర్శి శ్రీకాంత్ బాబు, శెట్టిపల్లి భూ బాధితుల కమిటీ నాయకులు రాధాకృష్ణ, సురేష్, రాజేంద్ర, నాదముని, హరి, రెడ్డిబాబు పాల్గొన్నారు.

సీబీఎస్ అవుట్‌గేట్‌లో పొంచివున్న ప్రమాదం


అవుట్ గేట్ వద్ద కుంగిపోయిన మురుగుకాలువ

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్సుస్టేషన్ నుంచి బస్సులు వెలుపలకు వచ్చే(అవుట్‌గేట్)మలుపు వద్ద మురుగునీరు ప్రవహించే కాలువ కుంగిపోయి పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. ఎలుకల వల్ల ఏర్పడిన కలుగులు వర్షానికి క్రమేణా పెరుగుతూ ప్రస్తుతం పెద్ద బొందలా తయారైంది. అడుగు భాగంలో మురుగునీరు ప్రవహిస్తోంది. చీకటి వేళ పొరపాటున కాలుజారితే అంతే సంగతులని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అదుపుతప్పి వాహనాలు కాలువలోకి దూసుకెళితే పరిస్థితి ఏంటని వాహనచోదకులు కంగారు పడుతున్నారు. ఆ స్థలం ఆర్టీసీ పరిధిలోకి రాదు కాబట్టి మరమ్మతులు చేయలేకపోతున్నారు. ఇంకనూ నిర్లక్ష్యం చేస్తే పెను ప్రమాదానికి దారి తీస్తుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్లక్ష్యం వీడి నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు చేయాల్సివుంది.

బోల్తాపడిన సూచికబోర్డు



తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అలిపిరి మార్గం, బాలాజీ బస్టాండుకు సమీపంలోని ఫుట్‌పాత్‌పై కొంతకాలంగా ఎత్తైన సూచికబోర్డు బోల్తా పడివుంది. శ్రీవారి భక్తుల సౌకర్యార్థం గతంలో ఈ బోర్డుపై స్థానిక ఆలయాలకు, సెంట్రల్ బస్సుస్టేషన్, రైల్వేస్టేషన్, విమానాశ్రయానికి చేరుకునే మార్గాలను తెలిపే పూర్తి వివరాలు పొందుపరిచారు. దీంతో కాలినడక భక్తులకు సౌకర్యంగా ఉండేది. కొంతకాలం క్రితం బోర్డును మోస్తున్న రెండు ఇనుప గడ్డర్ల కిందిభాగానికి తుప్పు పట్టడడంతో నేలకొరిగింది. ఆ తరువాత మరమ్మతులు చేయకుండా అలానే వదిలేశారు. దీనిని గమనించిన పాదచారులు సూచికబోర్డును ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడమేంటని పశ్నిస్తున్నారు.

స్వాతంత్ర్య దిన వేడుకల ఏర్పాట్ల పరిశీలన

తిరుపతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం పోలీసు పరేడ్ మైదానంలో జరుగుతున్న స్వాతంత్ర్య దిన వేడుకల ఏర్పాట్లను మంగళవారం కమిషనర్ ఎస్.మౌర్య పరిశీలించారు. కమిషనర్ వెంట ఆర్డీవో రామ్మోహన్, తుడా ఈఈ రవీంద్ర, ఎంఈ తులసి కుమార్, డీఈ మహేష్ తదితరులున్నారు.

లారీ బోల్తా

దొరవారిసత్రం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కలగుంట రైల్వే వంతెన సమీపంలో మంగళవారం లారీ బోల్తా పడింది. తెల్లరాయి లోడుతో చెన్నై వెళుతున్న లారీ తెల్లవారుజామున అదుపు తప్పడంతో రహదారి పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బస్సును ఢీకొన్న వ్యాన్

దొరవారిసత్రం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం నెలబల్లి సమీపంలో మంగళవారం సాయంత్రం చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్తున్న బస్సును వ్యాన్ వెనుక నుంచి ఢీకొంది. సూళ్లూరు పేట హోటళ్లలో మిగిలిపోయిన వ్యర్థ పదార్థాలను తీసుకుని నెల్లూరు వైపు వెళుతున్న వ్యాన్ అదుపుతప్పి బస్సును వెనుక నుంచి ఢీకొంది. వ్యాన్ ముందు భాగం దెబ్బతినగా, డ్రైవర్ నాగూర్ స్వల్పంగా గాయపడ్డాడు.

కావడి మొక్కుల యాత్రలో కారు ప్రమాదం

బ్రిడ్జి నుంచి కిందకు బోల్తాపడ్డ కారు ● ముగ్గురు మృతి, మరో ముగ్గురికి తీవ్రగాయాలు


ధ్వంసమైన కారు



పద్మమ్మ మృతదేహం - తీవ్రంగా గాయపడ్డ చిన్నబ్బరెడ్డి

గంగాధరనెల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గుడికి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు మండలం వేపంజేరి పంచాయతీ గోవిందరెడ్డిపల్లెకు చెందిన మాజీ మండల వైసీపీ కన్వీనర్ సురేంద్రరెడ్డి భార్య చిట్టెమ్మ(49), కుమార్తె కీర్తి (30), మనవడు శాన్విక్‌రెడ్డి (1), తమ్ముడు చిన్నబ్బరెడ్డి అలియాస్ విశ్వనాథరెడ్డి(52), మరదలు రేఖ (42), వారింట్లో పనిమనిషి పద్మమ్మ (58)తో కలిసి మంగళవారం మధ్యాహ్నం తమిళనాడులోని తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి గుడికి కావడి చెల్లింపుల కోసం కారులో బయల్దేరారు. చిత్తూరు - తచ్చూరు రోడ్డులో తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టుకు సమీపంలోని కుమార రాజాపేట వద్దకొచ్చేసరికి గుంతను తప్పించబోయి అక్కడున్న బ్రిడ్జిని కారు ఢీకొంది. తర్వాత బ్రిడ్జి నుంచి కిందకు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులోని పద్మమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చిన్నబ్బరెడ్డి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శాన్విక్‌రెడ్డి మరణించారు. చిట్టెమ్మ, కీర్తి, రేఖలకు కూడా తీవ్ర గాయాలవడంతో తమిళనాడులోని రాణిపేట సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలియడంతో గోవిందరెడ్డిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి బుధవారం రాణిపేట సీఎంసీకి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించనున్నారని వైసీపీ నేతలు పేర్కొన్నారు. సుమారు రెండు నెలల కిందటే సురేంద్రరెడ్డి కుమారుడికి వివాహమైంది. ఇంతలోనే ఈ ప్రమాదం జరగడం స్థానికులను కలచివేసింది.

దళితులపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి

● ప్లకార్డులు చేతపట్టి రుయాస్పత్రి ఎదుట నేతల నిరసన



రుయా ఆస్పత్రి ముందు నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే ఆరణి, నరసింహయాదవ్, సుగుణమ్మ, నేతలు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ టీడీపీ, జనసేన నేతలు రుయాస్పత్రి ఎదుట ప్లకార్డులు చేతపట్టి నిరసన వ్యక్తం చేశారు. వైసీపీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడి రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌కుమార్‌ను ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్‌తో కలిసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యాదవ కార్పొరేషన్, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్లు నరసింహయాదవ్, సుగుణమ్మ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో దౌర్జన్యాలు, దోపిడీలతో రౌడీల రాజ్యం నడిచిందని, ఆ సమయంలో దళితులపై దాడులు పెరిగాయన్నారు. ప్రస్తుతం వైసీపీ అధికారంలో లేకపోయినా ఆ పార్టీ నేతలు మాత్రం ఇప్పటికీ దళితులపై దాడులకు పాల్పడుతూనే ఉన్నారన్నారు. దళితులపై దాడులకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం ఇప్పటి వరకు దళితులపై జరిగిన దాడులకు సంబంధించిన ఫొటోలు, ప్లకార్డులు చేతపట్టి వారు ఆస్పత్రి ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు పరసారత్నం, శ్రీధర్‌వర్మ, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పిలుపునిచ్చారు. యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో సెనేట్ హాల్లో మంగళవారం అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. యువత డ్రగ్స్, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన రంగాల్లో సామర్థ్యాలను పెంచుకోవాలని సూచించారు. యువతోనే దేశ భవిష్యత్తు సాధ్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక ప్రతిభా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్, సీడీసీ డీన్ చెంగ్రాయుడు, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధారాణి, లైబ్రరీ డైరెక్టర్ సురేంద్రబాబు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ బీవీ మురళీధర్, కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో ప్రజాస్వామ్యం ఖూనీ

● జడ్పీటీసీ ఉప ఎన్నికపై ఎంపీ అప్పల నాయుడు

తిరుపతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో స్థానిక ఎన్నికలంటేనే ఓటర్లు భయభ్రాంతులకు గురయ్యేవారని, రౌడీ మూకలతో ఇష్టారాజ్యంగా వ్యవహరించి ప్రజాస్వామ్యాన్ని చంపేశారని విజయనగరం ఎంపీ కొలిశెట్టి అప్పల నాయుడు అన్నారు. మంగళవారం తిరుపతికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని తిరిగి బతికించేందుకే పోలీసు అధికారులు జడ్పీటీసీ ఉప ఎన్నికలో పాల్గొనే ఓటర్లకు స్వేచ్ఛనిచ్చారన్నారు. ముఖ్యమంత్రిగా చేసిన జగన్ రెడ్డే స్వయంగా పులివెందుల ఓటర్లకు ఫోన్ చేసి ఒక్కసారికి ఓటేయమని బ్రతిమలాడడం, ఆయన మేనమామ రవీంద్రనాథరెడ్డి పోలింగ్ సిబ్బందిని నీ అంతు చూస్తానని బెదిరించడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయని గుర్తుచేశారు. ఈనేపథ్యంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు పోలీసు ఉన్నతాధికారులు వస్తే మీకు భయమేంటి? అని ప్రశ్నించారు. మీ ఆగడాలు సాగలేదన్న భయం మీ మాటల ద్వారానే బయటపడుతోందని, తిరుపతి ఉప ఎన్నికలు, కుప్పం మున్సిపల్ ఎన్నికల సమయంలో వైసీపీ హయాంలో పొరుగు రాష్ట్రాల నుంచి దొంగ ఓటర్లను తీసుకొచ్చి ఓట్లు వేయించారన్నారు. నీలం సాహ్నిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నియమించింది జగన్ రెడ్డి కాదా? ఎన్నికల కమిషన్ దున్నపోతు మీద వర్షం పడినట్లు వ్యవహరిస్తోందంటూ ఒక మహిళను ఎంపీ స్థాయిలో ఉన్న వ్యక్తి అవమానించడం సిగ్గుచేటన్నారు.

వ్యసనాలపై యువతకు అవగాహన తప్పనిసరి



ఐఈఎస్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రాణాంతకమైన ఎయిడ్స్‌తో పాటు మాదకద్రవ్య వ్యసనాలపై యువత తప్పనిసరిగా అవగాహన కలిగివుండాలని, అప్పుడే వాటి నిర్మూలన సాధ్యపడుతోందని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. స్థానిక జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధుల ముందుస్తు గుర్తింపుపై మంగళవారం నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధులు, చెడు వ్యసనాలపై అవగాహన ఉన్నప్పుడే వాటి విషయంలో అందరూ అప్రమత్తంగా ఉంటారన్నారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, దాని బారినపడిన బాధితులపై వివక్ష చూపకూడదన్నారు. అనంతరం ఎయిడ్స్, మాదకద్రవ్య అలవాట్ల వలన ఎదురయ్యే దుష్ఫలితాలు, నష్టాలను గురించి వివరిస్తూ స్విమ్స్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

చేతి వృత్తులతోనే ఆర్థికాభివృద్ధి



మహిళలకు బ్యూటీషియన్ కోర్సు ముడిసామగ్రిని అందిస్తున్న డాక్టర్ మోహన్

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మహిళలు చేతి వృత్తుల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించుకోవచ్చని రాస్, జనశిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎం.మోహన్ అన్నారు. స్థానిక శివజ్యోతి నగర్‌లో రాస్, జనశిక్షణ సంస్థల ఆధ్వర్యంలో మూడు నెలల పాటు మహిళలకు నిర్వహించిన బ్యూటీషియన్ కోర్సు శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన వారికి ముడిసామగ్రిని ఉచితంగా అందజేశారు. అనంతరం మోహన్ మాట్లాడుతూ మారుతున్న నాగరికతకు అనుగుణంగా ఈ కోర్సులో శిక్షణ పొందిన వారికి ఉపయోగపడే అవకాశం ఉందన్నారు. మహిళలు కోర్సులో తెలుసుకున్న నైపుణ్యాన్ని ఉపయోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాస్ కోఆర్డినేటర్ కరుణాకర్ నాయుడు, బి.సుధాకర్ రెడ్డి, కె.రాజేశ్వరి, శ్రీలతలతో పాటు శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

పద్మావతి కాలేజీలో ర్యాగింగ్ వ్యతిరేక ప్రతిజ్ఞ



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణమ్మ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పద్మావతి డిగ్రీ కాలేజీలో యాంటీ ర్యాగింగ్ డే సందర్భంగా మంగళవారం విద్యార్థులు ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణమ్మ మాట్లాడుతూ.. విద్యార్థులు స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకుని, క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ర్యాగింగ్ వంటి వికృత చర్యలకు పాల్పడవద్దని కోరారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారికి కఠిన శిక్షలు అమల్లో ఉన్నాయని చెప్పారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల కలల్ని నెరవేర్చి, కాలేజీ ఖ్యాతిని పెంచాలని కోరారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూఎస్‌ఏలో పర్యటించిన పద్మావతి వర్సిటీ విద్యార్థిని



యూఎస్‌ఏలో భార్గవి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ లా విద్యార్థిని ఎన్.భార్గవి యూఎస్‌ఏలో పర్యటించారు. ఐదు వారాల పాటు న్యాయ సంబంధమైన పలు సంస్థల్లో ఆమె పర్యటించి, సంబంధిత ప్రతినిధులతో చర్చించారు. అక్కడ అమలవుతున్న న్యాయ విధానాన్ని తెలుసుకున్నారు. ఈ పర్యటన ముగించుకుని భార్గవి యూనివర్సిటీకి మంగళవారం తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని ఆమెను అభినందించారు. ఇంటర్నేషనల్ డీన్ విజయలక్ష్మి, లా హెడ్ సీతాకుమారి, పీఆర్వో శ్రీరజని తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన పోస్టర్లను మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు.

ఎమ్మెల్యే ఆదిమూలంపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లి), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే ఆదిమూలంపై సస్పెన్షన్ ఎత్తివేయాలని నాగలాపురం మాజీ ఎంపీపీ మురళి కోరారు. మంగళవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ అధిష్ఠానం ఎమ్మెల్యేకి పూర్తిస్థాయి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాలని కోరారు. నియోజకవర్గంలో టీడీపీ కోసం కష్టపడిన వారిపై కేసులు పెట్టడం తగదని అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, గోవిందస్వామి, భక్తవత్సలం, సుమాంజలి నాయుడు, రవి తదిరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి



కామరాజు (ఫైల్‌ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కామరాజు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఈయన కొంత కాలంగా లివర్ సమస్యతో బాధపడుతూ తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో జిల్లా పోలీసు అధికారుల సంక్షేమ సంఘం నాయకులు సోమశేఖరరెడ్డి, శంకర్ రెడ్డి, పురుషోత్తమ నాయుడు, అలిపిరి సీఐ రాంకిషోర్, ఎస్ఐ నాగార్జున రెడ్డిలు ఆయన భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం వుంచి నివాళులు అర్పించారు. పోలీసు సంక్షేమ సంఘం తరఫున అవసరమైన ఆర్థిక సాయం అందజేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

ఆటోల తనిఖీ

● 25 వాహనాలపై కేసుల నమోదు



ఆటోలను తనిఖీ చేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

తిరుపతి(రవాణా), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రవాణా శాఖాధికారులు మంగళవారం ఆటోలపై తనిఖీలు నిర్వహించారు. జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు జరిగాయి. డ్రైవర్ పక్కసీట్లో ప్రయాణికులు కూర్చోవడం, ఎక్కువ సంఖ్యలో పరిమితికి మించి ఆటోలలో ప్రయాణికులను తీసుకెళ్లడం వంటి వాటిని తీవ్రంగా పరిగణించి 25 ఆటోలపై కేసులు నమోదు చేశారు. ఇలాంటి ఉల్లంఘనలు పునరావృతమైతే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు లైసెన్స్ సస్పెన్షన్ తప్పదని అధికారులు హెచ్చరించారు. అనంతరం డ్రైవర్లకు నియమ నిబంధనలపై కౌన్సెలింగ్ ఇచ్చి ప్రయాణికులపట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, అతికానాజ్, మోహన్‌కుమార్, ఆంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు సీఐటీయూ అభినందనలు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా రాజీ లేని పోరాటాలు చేసి గ్రాట్యూటీ, 180 రోజుల ప్రసూతి సెలవులు, 62 సంవత్సరాలకు పదవీ విరమణ పెంపును ప్రభుత్వం నుంచి సాధించుకున్న ఆశా వర్కర్లకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మంగళవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తూ జీవో నెంబరు 94ను విడుదల చేయడంపై సీఐటీయూ జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది.





రైల్వేగేటు ముందు మడుగును తలపిస్తున్న రోడ్డు, రేణిగుంట రోడ్డులో రైల్వేగేటు మలుపు వద్ద పైకప్పులేకుండా మురుగునీటి ప్రవాహం

ఈ మడుగును ఎలా దాటాలి..?

తిరుపతి అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రేణిగుంట రోడ్డులోని ఫస్ట్‌రైల్వేగేటు ముందు మడుగును తలపిస్తోంది. రోడ్డుపై బురదనీరు అడుగుమేర నిల్వ ఉండడంతో అటు ఇటు దాటలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రివేళల్లో నీటి నిల్వను అంచనా వేయలేక అదుపుతప్పి పడిపోతున్నారు. ద్విచక్ర వాహనాలదీ ఇదే పరిస్థితి. కార్లు కూడా బురదనీటిని తాకుతూ ప్రయాణించాల్సి వస్తోంది. విధిలేని పరిస్థితుల్లో రోడ్డు అంచున నడుస్తున్నప్పుడు వాహనాల రాకపోకలకు బురదనీరు మీద పడుతోంది. వర్షం కురిసిన ప్రతీసారి ఇదే సమస్య ఎదురవుతోంది. రైల్వే అండర్ బ్రిడ్జి పనులు నత్తనడకన నడుస్తుండడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. రైల్వేతో పాటు నగరపాలక సంస్థ కూడా రోడ్డుకు మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందన్న విమర్శలు ఉన్నాయి. అదేవిధంగా రేణిగుంట రోడ్డు నుంచి రైల్వేగేటుకు వెళ్లే మార్గం మలుపులో మురుగునీరు కాలువ పైకప్పు కొట్టుకుపోయింది. అందులో నుంచి మురుగునీరు ప్రవహిస్తుండడంతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. కంపు భరించలేక పోతున్నారు. చుట్టూ మొక్కుబడిగా బారికేడ్లు ఏర్పాటుచేయడంతో రోడ్డు వెడల్పు కుంచించుకుపోయింది. తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. మూడు వైపులా వాహనాలు బారులు తీరుతుండటంతో ప్రజలు సతమతమవున్నారు. వెంటనే ఆ ప్రదేశంలో మరమ్మతులు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే ఆటోలు సీజ్: డీఎస్పీ



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రామకృష్ణమాచారి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే ఆటో డ్రైవర్ల లైసెన్సులు రద్దుచేసి, ఆటోలను సీజ్ చేస్తామని డీఎస్పీ రామకృష్ణమాచారి హెచ్చరించారు. తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి ఆధ్వర్యంలో ట్రాఫిక్ సీఐ సంజీవ్‌కుమార్, ఎస్ఐలు, సిబ్బంది టీమ్‌లుగా స్థానిక రైల్వే స్టేషన్, పూర్ణకుంభం సర్కిల్, అన్నమయ్య సర్కిల్, గరుడ సర్కిల్, స్విమ్స్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఏకకాలంలో ఆటోలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్సుతో పాటు సీ-బుక్, యూనిఫారంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్ వద్ద కొంతమంది ఆటో డ్రైవర్లు ఇతర ప్రాంతాల నుంచి తిరుమలకు వచ్చే భక్తులను బెదిరించి ఎక్కువ రేట్లు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులు వస్తే కేసులు నమోదుచేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. రోడ్లపై ఆటోలను ఆపి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. మంగళవారం ఒక్క రోజు నిబంధనలకు విరుద్ధంగా ఆటోలు నడుపుతున్న దాదాపు 45 ఆటోలకు భారీ ఎత్తున అపరాధ రుసుం విధించారు. తిరుపతిలో ఆటో డ్రైవర్లు భక్తులను బెదిరించినా, వేధించినా వెంటనే ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి 77021 34735 నెంబరుకు కానీ 102కు కానీ, సీఐలు 94407 96759, 994919 2949, 99666 67241, 70131 31110 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో ఎమ్మెల్యే భేటి



మాధవ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత తొలిసారిగా జిల్లా పర్యటనకు వచ్చిన పీవీఎన్ మాధవ్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం ఉదయం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, నేతలు వరప్రసాద్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు దళిత సమస్యలపై వినతులు



జవహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్ఎల్ఎస్ఏ నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 12 (ఆంధ్ర జ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు మంగళవారం పలు సంఘాలు వినతి పత్రాలు అందజేశాయి. ● దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షులు శివరాజు వినతిపత్రం అందజేశారు. గత వైసీపీ పాలనలో జిల్లాలోని పలు చోట్ల దళితులపై దాడులు జరిగాయని, వీటిపై విచారించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ● శ్రేష్ఠ పథకం ద్వారా ఇతర రాష్ట్రాలకు విద్యాభ్యాసం కోసం వెళ్లి మళ్లీ నీట్ వంటి ప్రవేశ పరీక్షల ద్వారా మన రాష్ట్రంలో చేరిన వారిని నాన్ లోకల్‌గా పరిగణిస్తున్నారని అరుంధతి ఫౌండేషన్ పేర్కొంది. ఇలాంటి వారికి స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ వర్తింప చేయాలని ఫౌండేషన్ ప్రతినిధి యాసారపు వెంకటేష్ వినతిపత్రం అందజేశారు. ● విదేశీ విద్యా పథకాన్ని ప్రారంభించాలని నేషనల్ లా స్టూడెంట్ యూనియన్ విన్నవించింది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విదేశాల్లో చదువుకునే అవకాశం కల్పించాలని ఆ సంఘం అధ్యక్షులు సుందరరాజు వినతిపత్రం అందజేశారు.

మఠం భవనం, లీజుదారుల్ని కాపాడాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లి), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మఠం భవనంతో పాటు లీజుదారులను కాపాడాలని, మఠం అధికారులు ఏకపక్ష ధోరణి వీడాలని కార్పొరేటర్ నరసింహాచారి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ మఠం భవనం శిథిలావస్థకు చేరుకుందని, దుకాణాలు ఖాళీ చేయాలనడం బాధాకరమన్నారు. మద్రాసు ఐఐటీ నిపుణులచే అధ్యయనం చేయిస్తామని కలెక్టర్ చెప్పినా వినడం లేదన్నారు. ఏకపక్ష నిర్ణయంతో కూల్చడానికి టెండర్లను ఆహ్వానించడం దారుణమన్నారు. దాదాపు 60 కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఏకపక్ష నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పొన్నాల చంద్ర, నరేంద్ర, భాస్కర్, వేణుగోపాల్, లీజుదారులు పాల్గొన్నారు.

రవాణా రంగ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయండి

● ఏఐటీయూసీ డిమాండ్

తిరుపతి (ఆటోనగర్), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వున్న రవాణా రంగంలో వున్న కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, శివ డిమాండ్ చేశారు. తిరుపతి ఆర్టీవో కార్యాలయం ఎదుట ఆటో, ట్యాక్సీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన దీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఆటో, ట్యాక్సీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వాహన మిత్ర పథకంలో రూ.15వేలు, చంద్రన్నబీమా కింద రూ.10లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని, వాహనాలు కొనుగోలు చేసే సమయంలో 5 శాతం వడ్డీతో రుణసదుపాయం కల్పిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు కోరారు. ఈ రంగంలో వున్న కార్మికులకు పింఛను, వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, నాగరాజ్, వెంకటేష్, శ్రీనివాసులు, రమేష్, బాల, ప్రమీల, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి వేడుకలు



విశేష అలంకరణలో వినాయకుడు

తిరుపతి(జీవకోన), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక వినాయక సాగర్ వద్ద ఉన్న సంకల్ప వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మంగళవారం సంకటహర చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ పురోహితుడు సురేష్ స్వామి, ధర్మకర్త చెంగారెడ్డి, సభ్యులు గుండాల గోపీనాథ్, నాదమునిరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఆనంద్, రాజశేఖర్‌రెడ్డి, శాంతిప్రియ, రత్నజ, కినీష్‌రెడ్డి, తన్విష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.భవాని ప్రసాద్ మంగళవారం తిరుపతి కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు ఆయన పూలమొక్కను అందించారు.



వా(ప్రే)మ హస్తం

తిరుపతి – ఆంధ్రజ్యోతి

ఎడమచేతి వాటం కలిగిన వారిని ఒకప్పుడు పుర్రచెయ్యోడు, లొడ్డోడు.. అని ఎగతాళి చేసేవారు. ఎడమచేతిని వాడడం ఏ రకంగానూ లోపం కాదు. అయినా ఇప్పటికీ కుటుంబాల్లో కూడా ఎంతో కొంత గాయపడే మాటలు విసురుతూనే ఉంటారు. బలవంతంగా కుడి చేతిని వాడాలని వేధిస్తుంటారు. ఆడా, మగా సమానం అన్నట్టే.. కుడి, ఎడమల్లోనూ తేడా లేదు. ఒకటి బలమైనది, మరొకటి బలహీనమైనది కానేకాదు. ఏది ఎక్కువగా వాడితే అది ఆ పనులకు అలవాటవుతుంది అంతే. ప్రపంచంలో ప్రతి 10 మందిలో ఒకరు ఎడమ చేతివాటం వారని అంచనా. ఎడమచేతి వివక్షను సమాజంలో పోగొట్టాలనే ఉద్దేశ్యంతో నేడు లెఫ్ట్‌హ్యాండర్స్‌డే జరుపుకుంటున్నారు.

లెఫ్ట్ హ్యాండర్స్ అనుకూలతలు

- బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారిలో కుడిచేతి వారికంటే త్వరగా ఎడమచేతివారు కోలుకుంటారు.
- క్రీడాకారులకు ప్రయోజనం ఎక్కువ
- టైపింగ్‌లోనూ వేగం, ● మెదడులోని ఎడమ, కుడి భాగాలతో మెరుగైన అనుసంధానం
- పార్కిన్‌సన్స్ వ్యాధి వచ్చే అవకాశాలు తక్కువ.
- నీటిలోపల చూసే సామర్థ్యం ఎక్కువ.



సర్జరీల్లోనూ సమస్య లేదు

చిన్నతనం నుంచి నాకు ఎడమ చేతివాటమే. ఎక్కడా ఇబ్బంది రాలేదు. యాదృచ్ఛికమే అయినా నా భర్త డాక్టర్ హరిబాబుది కూడా ఎడమ చేతివాటమే. ఆయన చిత్తూరు అపోలో హాస్పిటల్‌లో ఆర్థోపెడిక్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. సర్జరీల్లో మాకు ఎప్పుడూ ఏ సమస్యా రాలేదు. ఏ తేడా అనిపించలేదు.

- డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి




ఎడమచేతిని అడ్డుకోవద్దు

కుడి చేత్తో రాయడంవల్ల మెదడులోని ఎడమ అర్ధగోళం (భాష, లాజిక్ పనిచేసే ప్రదేశం) పని చేస్తుంది. ఎడమ చేత్తో రాయడం వల్ల కుడి అర్ధగోళం (సృజనాత్మకత, స్పేస్ అవగాహన గల ప్రదేశం) పని చేస్తుంది. అదే రెండింటినీ ఉపయోగించడం వల్ల కార్పస్ కాలాసమ్ (రెండు అర్ధగోళాలను కలిపే సేతు) బలపడుతుంది. చేతుల కదలికలను నియంత్రించే మెదడు భాగం కొత్త కదలికలను నేర్చుకుంటుంది. ఈకొత్త న్యూరల్ కనెక్షన్లు కొత్త పనికి అలవాటు పడే క్రమంలో కొత్త విషయాలను వేగంగా నేర్చుకునే సామర్థ్యం పెరుగుతుంది. రెండు చేతుల సమన్వయం మెరుగవుతుంది. టైపింగ్, సంగీత వాయిద్యాలు వాయించడం, ఆటల్లో చురుకుదనం, వేగం పెరుగుతాయి. పిల్లలు ఎడమ చేయి వాడుతుంటే అడ్డుకోవద్దు. వీలైతే రెండు చేతులూ వాడేలా ప్రోత్సహించండి.

- భాస్కర్ రాజు, మేక్‌మైబేబీ జీనియస్ స్కూల్ వ్యవస్థాపకుడు

సవ్యసాచి సంగరాజు

కుడి, ఎడమ తేడా లేదని నిరూపిస్తున్నారు సంగరాజు అశ్విని. రెండు చేతులతోనూ ఆమె ఒకే వేగంతో రాయగలరు. ఇంకా విశేషం ఏమిటంటే ఒకేసారి కుడిచేత్తో ఒక భాష, ఎడమ చేత్తో మరో భాషలో రాయడం. అక్షరాల అందంలోనూ కుడిచేతికీ, ఎడమ చేతికీ తేడా ఉండదు. ప్రస్తుతం తిరుపతిలోని మేక్‌మైబేబీ జీనియస్ స్కూల్ డైరెక్టర్‌గా ఉన్న అశ్విని..ఎడమచేతిని వాడే తమ విద్యార్థుల్లో న్యూనతను పోగొట్టడానికి తాను రాసి చూపిస్తుంటారు.



టీటీడీ విరాళంగా బ్యాటరీ బుగ్గీలు



టీటీడీకి మంగళవారం రెండు బ్యాటరీ బుగ్గీలు విరాళంగా అందాయి. బెంగుళూరుకు చెందిన చంద్రశేఖర్ అనే భక్తుడు రూ.11 లక్షలు విలువైన ఈ బ్యాటరీ వాహనాలను అందజేశారు. ఆలయం ముందు పూజలు చేసి, వాహనాల తాళాలను ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథంకు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


15నుంచి ఆడికృత్తిక ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక సందర్భంగా తిరుత్తణికి మూడు రోజుల పాటు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. 222 (15న 65, 16న 88, 17న 69) బస్సులతో తిరుత్తణికి, అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో గమ్యస్థానాలకు చేరవేయనున్నట్లు డీపీటీవో జగదీష్ ఓ ప్రకటనలో కోరారు. బస్సుల వివరాలిలా... ● తిరుపతి-తిరుత్తణి వయా నగరి - శుక్రవారం 4, శనివారం 5, ఆదివారం 5 ● అదేవిధంగా పచ్చికాపల్లం-తిరుత్తణి వయా నగరి 10, 20, 10 ● పుత్తూరు-తిరుత్తణి వయా పల్లిపట్టు 4, 6, 4 ● పుత్తూరు-తిరుత్తణి వయా నగరి 12, 12, 12 ● నగరి-తిరుత్తణి 5, 5, 5 ● కొత్తపల్లిమిట్ట-తిరుత్తణి వయా నగరి 10, 15, 15 ● సత్యవేడు-తిరుత్తణి వయా నాగలాపురం 10, 15, 10 ● నాగలాపురం-తిరుత్తణి 5, 5, 5 ● తిరుపతి-పాకాల - శుక్రవారం 5, శనివారం 5, ఆదివారం 3 చొప్పున బస్సులు నడుస్తాయి.

సర్వదర్శనానికి 12 గంటలు


తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.84 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,740
తలనీలాలు సమర్పించినవారు: 34,958



ప్రాణాలను నిలబెడదాం

రాజంపేటకు చెందిన 15ఏళ్ల స్పందనకు గుండె మార్పిడి చేయకపోతే ప్రాణాలకు ముప్పు వస్తుందని వైద్యులు తెలిపారు. కూలీ పనులు చేసుకునే ఆమె తల్లిదండ్రులు తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల హృదయాలయను ఆశ్రయించారు. వైద్యులు వెంటనే బాలిక వివరాలను జీవన్‌దాన్ పోర్టల్‌లో నమోదు చేశారు. నెలరోజుల తర్వాత గుంటూరుకు చెందిన ప్రసాద్(40) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ అయ్యాడు. అతని గుండెను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. హృదయాలయ వైద్యులు గుంటూరు వెళ్ల ప్రసాద్ గుండెను ఆగమేఘాలపై సేకరించారు. స్పందనకు అమర్చారు. ఇప్పుడు ఆ బాలిక చదువు కొనసాగిస్తోంది.



పూతలపట్టు మండలం సామనత్తంకు చెందిన బీటెక్ విద్యార్థి గొల్లపల్లి హేమకుమార్(24) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. అతని తల్లిదండ్రులు తమ బిడ్డ అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో వైద్యులు గుండెను పద్మావతి హృదయాలయానికి తరలించి 29 ఏళ్ల వ్యక్తికి అమర్చారు. గంగవరం మహిళకు కాలేయం, పూతలపట్టు మహిళకు కిడ్నీని అమర్చారు. ఒక వ్యక్తి అవయవాలు ముగ్గురి ప్రాణాలను నిలబెట్టింది.

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మరణించినా మరొకరిలో జీవించి ఉండాలంటే అవయవదానమొక్కటే మార్గం. పెద్ద మనసుతో స్పందిస్తే మరికొంతమంది ప్రాణాలను నిలపవచ్చు. అయితే అవయవదానంపై చాలామందికి సరైన అవగాహన లేదు. పైగా సెంటిమెంట్లు, అపోహలు తోడవుతున్నాయి. ఫలితంగా మరొకరి ప్రాణాలు నిలబెట్టే అవయవాలు మట్టిలో కలిసి పోతున్నాయి. ఒకప్పుడు ప్రధాన అవయవాలు చెడిపోతే మరణం తప్ప గత్యంతరంలేదు. ఇప్పుడు వైద్యరంగంలో వచ్చిన అధునాతన మార్పులతో అవయవాల మార్పిడి ద్వారా ఎందరో ప్రాణాలను నిలబెడుతున్నారు. ఎదురవుతున్న చిక్కల్లా ఎక్కువ మంది దాతలు ముందుకు రాకపోవడమే. వెంటాడుతున్న అవగాహనారాహిత్యమే.



గుంటూరులో దాత నుంచి సేకరించిన గుండెను పద్మావతి చిన్నపిల్లల హృదయాలయకు తీసుకు వస్తున్న వైద్యుడు

అవయవదానంతో మరికొందరికి పునర్జన్మ

నేడు అవయవదాన దినోత్సవం

అవరోధంగా మారుతున్న అవగాహనారాహిత్యం

జీవన్‌దాన్ పోర్టల్‌లో వివరాలు నమోదు

బ్రెయిన్ డెత్, లేదా ఇతర కేసుల్లో అవయవాలను దానం చేసేందుకు దాతలు ముందుకు వస్తే గ్రహీతలకు అందించేందుకు ప్రభుత్వం జీవన్‌దాన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. గుండె, లివరు, కిడ్నీ వంటి ప్రధాన అవయవాలు పాడైన వారి వివరాలను ఇందులో నమోదు చేసుకుంటున్నారు. దాత దొరికితే జీవన్‌దాన్ పోర్టల్లో బాధితులకు సమాచారమిస్తున్నారు. వెంటనే ఆ అవయవాలను మార్చి బాధితుల ప్రాణాలు నిలబెడుతున్నారు. పోర్టల్‌లో ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే మొదట అవకాశం కల్పిస్తుండటం, మిగిలిన వారికి దాతలు దొరికే వరకు ఏమీ చేయలేని పరిస్థితిలో ఉండటంతో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రతి పది నిముషాలకు ఒకరు పోర్టల్ జాబితో చేరుతుండగా, నమోదు చేసుకున్న వారిలో రోజుకు 20 మందికి పైగా ప్రాణాలు విడుస్తున్నట్లు సమాచారం. పది శాతం మందిని మాత్రమే అవయవ మార్పిడితో రక్షించగలుగుతున్నారు.అవయవదానంపై అవగాహన లోపం కారణంగానే ఇలాంటి పరిస్థితి దాపురిస్తోంది.

మన జిల్లాలో ఇలా..

- తిరుపతిలోని టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రిలో ఇప్పటి వరకు 20 గుండె మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగాయి. వీరిలో మూడు నెలల చిన్నారుల నుంచి 55 ఏళ్ల వయసున్న వారు కూడా ఉన్నారు.
- ఏడాది కిందట స్విమ్స్‌లో బ్రెయిన్ డెడ్‌కు గురైన వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో ముగ్గురి ప్రాణాలు నిలబెట్టారు.
- కుటుంబ సభ్యులతో అనుమతితో మృతుల కళ్లను రుయాస్పత్రి ఐ-బ్యాంక్ సేకరిస్తోంది. మరణానంతరం కళ్లు దానం చేసేందుకు ముందుకు వచ్చే వారి వివరాలను కూడా నమోదు చేసుకుంటున్నారు. సేకరించిన కళ్లను అవసరమైన వారికి అమర్చి వెలుగులు నింపుతున్నారు.

వీరి అవయవాలు దానం చేయవచ్చు

వివిధ సంఘటనల్లో బ్రెయిన్ డెడ్‌కు గురైన వారి అవయవాలన్నీ ఇతరులకు ఉపయోగపడతాయి. వైద్యుల పర్యవేక్షణలో మరణించిన వారివి కూడా కొన్ని అవయవాలు ఉపయోగపడతాయి. జీవించి ఉన్న వారు కిడ్నీ, కాలేయం వంటి అవయవాలను ఇవ్వవచ్చు. ఒకరి నుంచి సేకరించిన గుండె, కిడ్నీ, లివర్, కళ్లు, ఊపిరితిత్తులు, చిన్నపేగులతో ఎనిమిది మందికి పునర్జన్మ కలుగుతుంది. తీవ్రమైన అంటు వ్యాధులు, క్యాన్సర్, డయాబెటిక్‌తో అధికంగా బాధపడే వారి అవయవాలు పనికిరావు.



అవగాహన పెరగాలి

మరణించాక శరీరంతోపాటు అవయవాలను మట్టిలో కలిసిపోనీయకుండా కుటుంబ సభ్యులు ముందుకు రావాలి. గుండె మార్పిడి కోసం అనేక మంది ఎదురు చూస్తున్నారు. బ్రెయిన్‌డెడ్‌కు గురైన వారి అవయవాలను ఇటువంటి వారికి దానం చేస్తే ప్రాణాలు నిలబెట్టవచ్చు. ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహనతో స్పందించాలి.

- డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ డైరెక్టర్

8 మందికి పునర్జన్మ



బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో 8మంది ప్రాణాలను రక్షించవచ్చు. ఒకప్పుడు కిడ్నీ, లివర్ వంటివి మార్పిడీ చేసే అవకాశం ఉండేది. ప్రస్తుతం గుండెను సైతం మార్చుతున్నారు. కిడ్నీ, లివర్ వంటి అవయాలను దానం చేసేందుకు ఆరోగ్యవంతులైన వారు అర్హులు. ఒక కిడ్నీ, లివర్‌లో కొంత భాగం దానం చేశాక కూడా మామూలుగా బతకవచ్చు. అవయవదానానికి మించిన దానం మరొకటి లేదు.

- డాక్టర్ పీవీ రజనీకాంత్, లివర్ ట్రాన్స్‌ప్లాంటర్





బహుమతి పొందిన వాటిలో లావణ్య కుమార్, సాయికుమార్ తీసిన ఫొటోలు

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్లకు అవార్డులు

తిరుపతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ డేని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) నిర్వహించిన జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో తిరుపతి ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు ఆర్.లావణ్య కుమార్, కె.సాయికుమార్‌లకు బహుమతులు లభించాయి. స్పాట్‌న్యూస్ ఫొటో విభాగంలో లావణ్యకుమార్ తీసిన కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుల ఫొటోకు అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. జనరల్ విభాగంలో తిరుమల నడకదారిలో ఐసు తింటున్న ఉడుత ఫొటో తీసిన సాయికుమార్‌కు అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించారు. ఆగస్టు 19న విజయవాడలో జరగనున్న వేడుకలో వారు అవార్డులు అందుకోనున్నారు.

షార్ డైరెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

సూళ్లూరుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): షార్ కొత్త డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్‌ను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి షార్ నుంచి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని కోరారు. ఆమెతో పాటు నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, కొక్కు శంకరయ్య, మాధవనాయుడు, సెల్వం తదితరులున్నారు.

రుయాస్పత్రికి క్యాథ్‌ల్యాబ్ మంజూరు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న గుండె సంబంధిత వ్యాధుల బాధితుల కోసం ప్రభుత్వం రుయాస్పత్రికి క్యాథ్‌ల్యాబ్‌ను మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రానున్న రోజుల్లో రుయాస్పత్రి మెరుగైన గుండె వైద్యాన్ని పీపీపీ (పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్) పద్ధతిలో అందించనుంది.

హెచ్‌డీపీటీ ఛైర్మన్‌గా దాసరి శ్రీనివాసులు



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ (హెచ్‌డీపీటీ) ఛైర్మన్‌గా బీజేపీ నేత, తిరుపతికి చెందిన దాసరి శ్రీనివాసులును రాష్ట్ర ప్రభుత్వ నియమించింది. ఏపీలో 31 నామినేటెడ్ పదవులను భర్తీచేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి అయిన దాసరి శ్రీనివాసులుకు ఈ పదవి దక్కింది. హిందూ ధర్మ పరిరక్షణార్థం మాజీ ఐఏఎస్ అధికారి పీవీఆర్కే ప్రసాద్ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖకు అనుబంధంగా హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. అంతటి ప్రతిష్ఠాత్మక ట్రస్ట్‌కు ఛైర్మన్‌గా నియమితులవడంపట్ల దాసరి శ్రీనివాసులు ఆనందం వ్యక్తం చేశారు.

మత్స్యకార సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా బొమ్మన శ్రీధర్



తడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మత్స్యకార సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా తడ మండలానికి చెందిన మత్స్యకార నాయకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్‌ను ప్రభుత్వం నియమించింది. టీడీపీ ఆవిర్భావం నుంచి బొమ్మన కుటుంబం పార్టీలో కొనసాగుతోంది. శ్రీధర్ తండ్రి బొమ్మన సుందరయ్య మత్స్యకార గ్రామాల్లో టీడీపీ పటిష్టతకు ఎంతో కృషి చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో కేసులను ఎదుర్కొన్నారు.

నులిపురుగు నివారణ మాత్రలతో మెరుగైన ఆరోగ్యం

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో రక్తహీనతను తగ్గించి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో నులిపురుగు నివారణ(ఆల్బెండజోల్) మాత్రలు దోహదపడతాయని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా మంగవారం తిరుపతి నగరం కొర్లగుంటలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 1-19 ఏళ్లలోపు ఉన్న 4,97,511 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఆయన పలువురు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీఐవో కుమార్, అధికారులు డాక్టర్ శ్రీనివాసవర్మ, డాక్టర్ సౌజన్యలక్ష్మి, డాక్టర్ శ్రీనివాసులు, రెడ్డిప్రసాద్, కిరణ్‌కుమార్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు వేస్తున్న కలెక్టర్



పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో సతీష్‌బాబు, ఉపాధ్యాయులు

● ఉపాధ్యాయుల చొరవతో

నిరుపేద పిల్లల బడిబాట

ఎర్రావారిపాలెం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఇటుక బట్టీల్లో పని చేసే నిరుపేద దంపతులకు చెందిన ఇద్దరు పిల్లలను బడిబాట పట్టించడంలో ఎంఈవో, ఉపాధ్యాయుల శ్రద్ధ ఫలించింది. నెరబైలు పంచాయతీ తలకోన దారిలోని ఓ ఇటుక బట్టీలో పనిచేసేందుకు మూడు యానాది కుటుంబాలు వలస వచ్చాయి. వీరిలో గుండ్రాతి కుప్పం నాగరాజు, ధనలక్ష్మి దంపతులకు ఐదుగురు పిల్లలున్నారు. వీరిలో శ్రీనివాసులు, ముకేష్‌కు ఐదేళ్లు దాటినా పాఠశాలకు పంపలేదు. ఈ క్రమంలో మంగళవారం ఎంఈవో-2 సతీష్‌బాబు నెరబైలు మండల పరిషత్ మోడల్ స్కూల్‌కు తనిఖీకి వచ్చారు. బడికి రాని పిల్లల గురించి ఆరా తీశారు. సమీపంలోని ఇటుకబట్టీలో కూలీల పిల్లలు స్కూలులో చేరలేదని తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం, టీచర్లతో కలిసి ఇటుక బట్టీ వద్దకు వెళ్లారు. ఉపాధ్యాయులను చూసిన పిల్లలు దూరంగా చెట్లచాటున దాక్కున్నారు. నాగరాజు, ధనలక్ష్మి దంపతులతో ఉపాధ్యాయులు మాట్లాడారు. పిల్లలకు ఆధార్ కార్డు లేదని వాళ్లు చెప్పగా.. తండ్రికి ఆధార్ కార్డు ద్వారా పిల్లలకు తామే ఇప్పిస్తామని ఎంఈవో తెలిపారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలిద్దరినీ స్కూలుకు పంపేందుకు అంగీకరించారు. వెంటనే శ్రీనివాసులు, ముఖేష్‌కు మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ప్రవేశం కల్పించారు. పిల్లలకు దుస్తులనూ ఉపాధ్యాయులే సమకూర్చారు.



టీచర్లను చూసి చెట్టు చాటున దాక్కున్న పిల్లలు

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి


ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ హుస్సేన్ భాషా

చిట్టమూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి, అల్యూమినియం తీగలను ఎత్తుకెళ్లే ముఠాను అరెస్టు చేసినట్లు వాకాడు సీఐ హుస్సేన్ భాషా తెలిపారు. చిట్టమూరులో మీడియాకు వివరాలు వెల్లడించారు. మంగళవారం చిట్టమూరు ఎస్‌ఐ చిన్న బలరామయ్య ఆధ్వర్యంలో పోలీసులు మండల పరిధిలోని కలుగుర్తిపాడు వద్ద అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో రాగి, అల్యూమినియం తీగలు ఉండడంతో ఆ వాహనంలో ప్రయాణిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. మండలంలోని ఆరూరు అరుందతివాడకు చెందిన గంగిపంగి వెంకటేష్, యర్రబల్లి పోలయ్య, కంటేపల్లి కోటేశ్వరావు, కంటేపల్లి సుబ్బయ్య, కంటేపల్లి గిరిబాబు ముఠాగా ఏర్పడి రొయ్యల చెరువుల వద్ద, వ్యవసాయ పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులో ఉన్న రాగి, అల్యూమినియం తీగలను చోరీ చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు వీరు చిట్టమూరు, కోట, వాకాడు, దొరవారిసత్రం మండలాల్లో 38 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి, అల్యూమినియం తీగలను ఎత్తుకెళ్లారు. వాహనంతో పాటు 175 కిలోల రాగి, 338 కిలోలు అల్యూమినియం తీగలను స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోట కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ హుస్సేన్ భాషా తెలిపారు.

జగన్ పరిశ్రమలను తరిమేయడం వల్లే నిరుద్యోగ సమస్య: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో మాజీ సీఎం జగన్ పరిశ్రమలను తరిమేయడం వల్లే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఏర్పడిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ విశ్వోదయ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ యువతకు ఏడాదికి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకొనే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. మూడు నెలలకోసారి జాబ్‌మేళా నిర్వహించి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే ఇటీవల సింగపూర్‌కు వెళ్లి అక్కడి పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తే, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టవద్దంటూ జగన్ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అనంతరం జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన యువతకు నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయశేఖర్, స్కిల్‌డెవలప్‌మెంట్ జిల్లా అధికారి లోకనాథం, టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, మంకు ఆనంద్, మల్లారం బాబు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ ఏర్పాటు చేయండి



డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎన్‌ఎంయూఏ, ఏపీఎన్‌జీవో నాయకులు

గూడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తక్షణమే పీఆర్సీ ఏర్పాటు చేయాలని ఎన్‌ఎంయూఏ, ఏపీఎన్‌జీవో నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్, ఏపీఎన్‌జీవో ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వేతన సవరణ గడువు ముగిసి రెండేళ్లు పూర్తయిందని, వెంటనే ఐఆర్ ప్రకటించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్మెంట్ చెల్లింపులు చేయాలని కోరారు. అలాగే ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు పదోన్నతులను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రావణ్, తనూజ్, వెంకయ్య, బాషా, ప్రవీణ్, శ్రీనివాసులు, కృష్ణ, పోలయ్య, రమేష్, రఘు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాళంగి నదిలో నిమజ్జన ప్రాంతాల పరిశీలన

సూళ్లూరుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా గణేశ్ ప్రతిమలను నిమజ్జనం చేసే కాళంగి నది ప్రాంతాలను మంగళవారం సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు పరిశీలించారు. నిమజ్జనం చేసే ప్రాంతాల్లో చేయాల్సిన ఏర్పాట్ల గురించి మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యకు లేఖ రాశారు. వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులతో ఈనెల 16న సమావేశం నిర్వహించనున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించవద్దు



డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

సూళ్లూరుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించవద్దంటూ మంగళవారం ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు ఎన్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గవర్నర్‌పేట-2 డిపోకు సంబంధించిన 4.5 ఎకరాలను లులూ సంస్థ కేటాయించిన జీవోను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శేఖర్, కరుణాకర్ రెడ్డి, రాధయ్య, రమేష్, ఆనంద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం

సూళ్లూరుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ ఎస్‌ఎన్‌ఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బి శంకర్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. అంతకుముందు జాతీయ నులిపురుగుల దినోత్సవ సందర్భంగా విద్యార్థులు నులిపురుగుల నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, అధ్యాపకులు ఏడు కొండలు, శ్రీనివాసులు, జీకే ప్రసాద్ అమ్మాజీ, లైబ్రేరియన్ రమేష్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులను అడ్డుకున్న మహిళలు

నాయుడుపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లోతువానిగుంట ముఖ ద్వారం వద్ద మున్సిపాలిటీ సిబ్బంది చేపడుతున్న డ్రైనేజీ పనులను మహిళలు అడ్డుకున్నారు. బీఎంఆర్ నగర్ కాలనీ నుంచి వచ్చే డ్రైనేజీ వాటర్‌ను లోతువానిగుంట కాలువ వద్ద కలుపుతుండగా కాలనీవాసులు అడ్డుకొని నిరసన తెలిపారు.

లారీ బోల్తా

దొరవారిసత్రం, అస్టు 12(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కలగుంట రైల్వే వంతెన సమీపంలో మంగళవారం లారీ బోల్తా పడింది. తెల్లరాయి లోడుతో చెన్నై వెళుతున్న లారీ తెల్లవారుజామున అదుపు తప్పడంతో రహదారి పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బస్సును ఢీకొన్న వ్యాన్

దొరవారిసత్రం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం నెలబల్లి సమీపంలో మంగళవారం సాయంత్రం చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్తున్న బస్సును వ్యాన్ వెనుక నుంచి ఢీకొంది. సూళ్లూరుపేట హోటళ్లలో మిగిలిపోయిన వ్యర్థ పదార్థాలను తీసుకుని నెల్లూరు వైపు వెళుతున్న వ్యాన్ అదుపుతప్పి బస్సును వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ ముందు భాగం దెబ్బతినగా, డ్రైవర్ నాగూర్ స్వల్పంగా గాయపడ్డాడు.

గ్రంథాలయ సేవలేవీ?

- మూడేళ్లుగా లైబ్రేరియన్ పోస్టు ఖాళీ
- పది నెలలుగా తలుపులు తెరిస్తే ఒట్టు

సూళ్లూరుపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణ వాసులకు పది నెలలుగా గ్రంథాలయ సేవలు అందుబాటులో లేవు. ఇక్కడ లైబ్రేరియన్ పోస్టు మూడేళ్లుగా ఖాళీగా ఉంది. నెల్లూరులో పనిచేసే సహాయకుడిని సూళ్లూరుపేట లైబ్రరీ ఇన్‌చార్జిగా నియమించడంతో ఆయన వారంలో మూడు రోజులు ఇక్కడ విధులు నిర్వహించేవారు. గడిచిన పది నెలల నుంచి ఆ ఉద్యోగిని నెల్లూరుకే పరిమితం చేయడంతో లైబ్రరీ తలుపులు తెరుచుకోవడం లేదు. సూళ్లూరుపేట గ్రంథాలయానికి సహాకుడిని నియమిస్తామని జిల్లా అధికారులు చెబుతున్నా ఆ దిశగా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. నెలల తరబడి గ్రంథాలయం తెరవకపోవడంపై పలువురు ఎమ్మెల్యే విజయశ్రీ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. కనీసం జాతీయ గ్రంథాలయ దినోత్సవమైన మంగళవారం నాడు కూడా తలుపులు తెరవకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీ ప్రజలు చెల్లిస్తున్న పన్నుల్లో 8 శాంత మేర జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.లక్షల్లో చెల్లిస్తున్నా నియోజకవర్గ కేంద్రంని గ్రంథాలయానికి లైబ్రేరియన్‌ను నియమించకపోవడం ఏమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోజూ లైబ్రరీ తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.



జాతీయ గ్రంథాలయ దినోత్సవం నాడూ మూసివున్న లైబ్రరీ

గంజాయి విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయి, డ్రగ్స్, నిషేధిత మత్తుపదార్థాలు విక్రయాలు సాగించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో గంజాయి విక్రయాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఇటీవల ఆస్పత్రి రోడ్డులోని ఓ దుకాణం వద్ద గంజాయి విక్రయాలకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ నిర్వహిస్తున్నామని, ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. పట్టణంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. వినాయక చవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతిని తీసుకోవాలన్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాంతియుత సమాజానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కోరారు. కార్యక్రమంలో సీఐ శేఖర్‌బాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సూళ్లూరుపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు దృష్టి సారించారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'పట్టమని పది రోజులే, యథావిధిగా రోడ్లపై వాహనాల పార్కింగ్, పట్టణ వాసులకు తప్పని ట్రాఫిక్ తిప్పలు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో పోలీసులు స్పందించారు. సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు పట్టణంలో తిరుగుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలు, దుకాణ యజమానులను హెచ్చ రించారు. రోడ్లపై అడ్డదిడ్డంగా, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లో రోడ్డుకు అడ్డంగా పెట్టిన వాహనదారులకు జరిమానా విధించారు. బజారు వీధుల్లో దుకాణదారులు హద్దులుదాటి వస్తువులు పెడితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నామినేటెడ్ పదవుల్లో జనసేనకు ప్రాధాన్యం ఇవ్వండి

వెంకటగిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల కేటాయింపులో జనసేన నాయకులకు తగు ప్రాధాన్యం ఇవ్వాలని ఆ పార్టీ నాయకుడు తోట కృష్ణయ్య ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను కోరారు. మంగళవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను ఆయన నివాసంలో తోట కృష్ణయ్య కలిశారు. ఇటీవల సొసైటీల నియామకాల్లో జనసేన నేతలకు కొన్ని డైరక్టర్ పదవులు ఇచ్చినందుకు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపి శాలువాలు కప్పి సన్మానించారు. అదేవిధంగా ఆలయ కమిటీల్లో, సొసైటీ అధ్యక్ష పదవుల ఎంపికలోనూ జనసేన నాయకులు అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జల్లెల రాజేష్, మాలే హరిప్రసాద్, కొండాపురం కస్తూరి, జి.సురేష్ బాబు, మస్తాన్, పగడాల వెంకటరమణ, స్వామి, ఎం.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు

ఐకాన్ బోర్డు ప్రారంభం



ఐకాన్ బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్ రెడ్డి, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట జాతీయ రహదారిపై హోలీక్రాస్ సర్కిల్ ముఖద్వారం వద్ద రూ.4 లక్షలతో నూతనంగా నిర్మించిన ఐ లవ్ సూళ్లూరుపేట ఐకాన్ బోర్డును ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మంగళవారం ప్రారంభించారు. ముఖద్వారంలో ఐకాన్ బోర్డు ఏర్పాటుకు ఎంఎం శ్రీనివాసులు రూ.2 లక్షలు ఇవ్వగా, మిగిలిన రూ.2 లక్షలు మున్సిపాలిటీ నిధులతో నిర్మించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, చిట్టేటి పెరుమాల్, అలవల శ్రీనివాసులు, శ్రీధర్, ఆలీభాయ్, నలజాం రాము, బొమ్మన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో వ్యాసరచన పోటీలు

కోట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్‌లో ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఇన్‌స్టిట్యూషన్, ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో యువశక్తి అంకుర పరిశ్రమ నైపుణ్యం, భారతీయ ఆవిష్కర్తకు స్ఫూర్తిదాయకం అనే అంశంపై ఇంజనీరింగ్ విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు జరిగాయి. విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో పోటీల్లో పాల్గొనడం జరిగింది. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

కోట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకూడదని తహసీల్దారు జయజయరావు, ఎస్‌ఐ పవన్ కుమార్ అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం వినాయక చవితి ఉత్సవాలపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష జరిగింది. ఉత్సవాలు జరిపే గ్రామాల్లో ముందుగా అనుమతులు పొందాలన్నారు. ఎక్కడా యువతను రెచ్చగొట్టే విధంగా డ్యాన్స్‌లు, డీజేలు నిర్వహించరాదన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

చిట్టమూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): చవితి సందర్భంగా వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని వాకాడు సీఐ హుస్సేన్ భాషా తెలిపారు. చిట్టమూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ... చవితి ఉత్సవాలకు మండపాలు ఏర్పాటు చేసుకొనే వారు ముందుగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఉత్సవాల్లో డీజేలు పూర్తిగా నిషేధమని, మండపాల వద్ద అసాంఘిక కార్యక్రమాలు జరిగితే ఉత్సవ నిర్వాహకులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఆయన వెంట ఎస్‌ఐ చిన్న బలరామయ్య ఉన్నారు.

స్వమిత్వ సర్వే పక్కాగా నిర్వహించాలి

బాలాయపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) స్వమిత్వ సర్వే పక్కాగా నిర్వహించాలని డీడీవో వాణిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కడగుంట గ్రామంలో జరుగుతున్న స్వమిత్వ సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వమిత్వ సర్వే ద్వారా గ్రామాల్లో నివాస స్థలాల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అంతేకాకుండా నివాస స్థలాకు పూర్తి హక్కులు లభిస్తాయన్నారు. అనంతరం కడగుంట, బాలాయపల్లిలోని చెత్తతో సంపద తయారీ కేంద్రాలను డీడీవో పరిశీలించారు. చెత్త సేకరణ, నిర్వహణపై పలు సూచనలు చేశారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలోని డిప్యూటీ ఎంపీడీవో గదిలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు ఆర్ముగం, లీలావతి, దయాకర్, నాయకులు చిత్తూరు ఈశ్వరయ్య, వప్పతొట్టి మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

వెంకటగిరి టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లి వద్ద ఉన్న తెలుగుగంగ కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని సీఐ రమణ తెలిపారు. మంగళవారం సాయంత్రం జంగాలపల్లి వద్ద తెలుగుగంగ కాలువలో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

యువతి అదృశ్యం

సూళ్లూరుపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలోని ఆబాక గ్రామానికి ఏలింబేటి లలితమ్మ తన కుమార్తె అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు



మహాలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

సూళ్లూరుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావమణ మాసాన్ని పురష్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేక వేదికపై అష్టలక్ష్మీలను కొలవుదీర్చి కలశంతో అమ్మవారి రూపాన్ని పెట్టి వేదపండితులు, మంత్రోచ్చరణల నడుమ పూజలు జరిపారు. కార్యక్రమంలో కన్యకాపరమేశ్వరి వాలెంటరీ సంఘం అధ్యక్షుడు కాకి శ్రీమ్మూర్తి, కార్యదర్శి పైడిమర్రి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో విద్యార్థినుల ప్రతిభ

తడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బాల్ బ్యాడ్మింటన్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు తడ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు తేజ, కీర్తి ఎంపికయ్యారు. వారిని ఆచార్య భరద్వాజ సంస్థ సభ్యులు అభినందించి వారికి క్రీడాసామగ్రిని మంగళవారం అందజేశారు.

ఘనంగా కుంభాభిషేకం



సంగమేశ్వరస్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న వేద పండితులు

కోట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల సంగమేశ్వర స్వామి ఆలయంలో మూడో రోజు మంగళవారం కుంభాభిషేకాలు ఘనంగా జరిగాయి. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక హోమాలు జరిగాయి. కామాక్షీదేవి నూతన విగ్రహాన్ని ప్రత్యేక పాలకుండలో ఉంచారు. అమ్మవారి విగ్రహంతో పాటు పలు విగ్రహాలను బుధవారం ప్రతిష్టించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాలతో గూడలి పురవీధుల్లో గ్రామోత్సవం జరిగింది.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి

గూడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు నైపుణ్యాలను పెంపొందించుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని టీడీపీ నాయకుడు ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం చెన్నూరు గ్రామంలో గ్రాస్‌రూట్స్ స్పోర్ట్స్ ఇనిషియేటివ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అండర్-16 బాలుర విభాగంలో ఇండిపెండెన్స్ డే క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తిని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, రామ్‌గోపాల్, నాగూర్‌బాబు, అవినాష్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో చంద్రశేఖర్

ఓజిలి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అధికారులు తమ శాఖల వివరాలు చదువుకుంటూ వెళ్లడం... ఎంపీటీసీలు దిక్కులు చూస్తూ కూర్చోవడం... సర్పంచులు గైర్హాజరవడం... కార్యదర్శులు, వీర్వోలు, పలుశాఖల అధికారులు సమావేశానికి డుమ్మాకొట్టడం... ఇది మంగళవారం మంగళవారం ఎంపీపీ గడ్డం అరుణమ్మ అధ్యక్షతన జరిగిన ఓజిలి మండల సమావేశం తీరు. ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ అధికారులు తీసుకున్న చర్యలను ప్రశ్నించాల్సిన ఎంపీటీసీ సభ్యులు నోరు మెదపలేదు. సమావేశంలో మాట్లాడమని ఎంపీడీవో విజయలక్ష్మి కోరినా ఎంపీపీ ఆసక్తి చూపలేదు. సమావేశానికి హాజరైన కొద్దిమంది అధికారులు తమశాఖల్లో పురోగతి నివేదికను యథాలాపంగా చదివి మమ అనిపించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ లెక్కల ప్రసాద్‌నాయుడు, తహసీల్దారు పద్మావతి, అత్తివరం, ఆరిమేనిపాడు ఎంపీటీసీ సభ్యులు శేఖర్, గుంటమడుగు రఘురామరాజు, డాక్టర్ హిమజ, వ్యవసాయాధికారి వరప్రసాద్, ట్రాన్స్‌కో ఏఈ అనీల్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రవివర్మ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలోనే అవినీతి, అక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న సంచి కృష్ణయ్య

పెళ్లకూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కొండలను సైతం కరిగించి అవినీతి, అక్రమాలుకు పాల్పడ్డారని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు శిరసనంబేడు, రోసనూరు కొండలు తవ్వి కోట్లాది రూపాయలు స్వాహా చేశారని ఆరోపించారు. కామిరెడి సత్యనారాయణరెడ్డి చిల్లకూరులో నిర్మిస్తున్న కోళ్లఫారం విషయంలో టీడీపీ నాయకులపై చేస్తున్న ఆరోపణలు అవాస్తమన్నారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమలను నెలకొల్పి అభివృద్ధిని కాంక్షిస్తుందే తప్ప అవినీతికి పాల్పడదన్నారు. మరోసారి టీడీపీపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, పాపాడి రాజగోపాల్‌రెడ్డి, శేఖర్‌నాయుడు, కృష్ణమనాయుడు, పాలచ్చూరు నరేంద్రయాదవ్, సన్నాడి వేణురెడ్డి, ఎల్లంటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో పేదలపై భారం

నాయుడుపేట టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో పేదలపై చార్జీల భారం పడుతుందని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళవారం నాయుడుపేట విద్యుత్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఆ సంఘ నేత శివకవి ముకుంద మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపడం సబబుకాదన్నారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు కాలేషా, వెంకటయ్య, శ్రీనివాసులు, రామచంద్రయ్య, నాగరాజు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అభిషేక్

గూడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని మనస్తత్వవేత్త, కెరీర్ కౌన్సెలర్ అభిషేక్ అన్నారు. మంగళవారం స్థానిక ఎల్‌ఏపీ పాఠశాలలో విద్యార్థులకు మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుల మానసిక ఒత్తిడిని తగ్గించుకుని సులభతరమైన పద్ధతిలో విద్యాభ్యాసం సాగించాలన్నారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఎంచుకుని, వాటిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా, ఏకాగ్రతతో పట్టుదలతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బుస్సారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలి

గూడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. మంగళవారం కళాశాల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, డాక్టర్ పీర్‌కుమార్, షైమూన్, విజయమహేష్, నారాయణ రాజు, శైలజ, సురేంద్ర, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి

నారాయణవనం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలు తీసుకునే ఆహార పదార్థాలు, వారి ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం సందర్భంగా నారాయణవనం జడ్పీ హైస్కూల్‌లో ఆల్బెండ జోల్ మాత్రలను విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రాంతాల్లో నాణ్యత లేని ఆహార పదార్థాలు తింటే కడుపులో నులిపురుగులు చేరి అనారోగ్యం బారిన పడతారన్నారు. దీంతో శారీరకంగా, మానసికంగా విద్యార్థులు ఇబ్బంది పడతారన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్‌కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు దర్శిత్‌రాజ్, రాగసుధా, ఎంపీడీవో అరుణ,సర్పంచ్ శారదమ్మ, హెచ్ఎం సులోచన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పిచ్చాటూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని, సూపర్ సిక్స్‌ను అమలు చేసి తీరుతుందని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. పిచ్చాటూరు మండలం గోవర్ధనగిరిలో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంచుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవులు నాయుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు పద్మనాభరాజు, పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చందనస్రవంతి, సర్పంచ్ సతీష్, నాయకులు గంధమనేని రాజేష్, రామినేని రమేష్, వెంకటేశులు నాయుడు, మధుబాబు, యుగంధర్‌రెడ్డి, శివకుమార్, నరేంద్ర, యాచేంద్ర నాయుడు పాల్గొన్నారు.


కరపత్రాల పంపిణీలో శంకర్ రెడ్డి

నాయీ బ్రాహ్మణ వృత్తికి జీవం పోసిన సీఎం

శ్రీకాళహస్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తమ చేతి వృత్తికి ఉచిత విద్యుత్ పథకంతో సీఎం చంద్రబాబు జీవం పోశారని నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంట్ నాయకులు కోటా చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని జయరామ రావు వీధిలో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తమ కులవృత్తిని గత వైసీపీ పాలకులు నీరుగార్చారని వాపోయారు. నాయీ బ్రాహ్మణులు నిర్వహించే సెలూన్ షాపులకు 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా ఇవ్వడం ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. అలాగే వివిధ దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు వేతనాన్ని రూ.25 వేలకు పెంచడం అభినందనీయమన్నారు.ఆదరణ పథకం ద్వారా పనిముట్లు పంపిణీ చేసిన టీడీపీ.. ఆ పథకాన్ని గత వైసీపీ రద్దు చేసిందన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం తిరిగి ఆదరణ ద్వారా న్యాయం చేస్తుందని ఆశిస్తున్నామన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురువారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నియకుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ రవి, టీడీపీ బీసీ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు, తంగేళ్లపాళెం సింగిల్ విండో అధ్యక్షుడు భాస్కర్, మునిరాజ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

మా బడి మాకే కావాలి

కేవీబీపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అనంతపద్మనాభపురం, బంగారమ్మ కండ్రిగ, జ్ఞానంబకండ్రిగ, పాతపాళెం గ్రామాలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మంగళవారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం వద్ద తమ బడి తమకే కావాలని ధర్నా నిర్వహించారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలు 3-4కిలోమీటర్లు దూరం నడిచి వెళ్ళి రాలేరని ఇప్పటికే పాఠశాలలు తెరిచి 60 రోజులు గడుస్తున్నా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. స్థానిక విద్యాశాఖాధికారులకు ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలు తాము అమలు చేస్తున్నామని చెప్పినా తల్లిదండ్రులు వినడం లేదన్నారు.


ఎంఈవో కార్యాలయం వద్ద విద్యార్థుల ధర్నా

పుత్తూరు వార్తలు

సమస్యల పరిష్కారానికి ధర్నా

పుత్తూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలంటూ పుత్తూరు ఆర్టీసీ డిపో గ్యారేజీ ఎదుట మంగళవారం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని వాపోయారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో సిబ్బందికి కలిగే ఇబ్బందులను పట్టించుకోలేదని, విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకే అప్పజెప్పాలని, డీఏలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పీఆర్సీ, కారుణ్య నియామకాలు తదితరాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్ముగం, పెరుమాళ్, సుందరం పాల్గొన్నారు.



ర్యాగింగ్ నిరోధానికి ప్రతిజ్ఞ

పుత్తూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కొత్తగా చేరిన విద్యార్థుల్లో సీనియర్లు భయం పోగొడుతూ అభిమానం, అప్యాయతలను పంచే వాతావరణాన్ని కలిగించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి కోరారు. కళాశాలలో మంగళవారం యాంటీ ర్యాగింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... ర్యాగింగ్‌కు పాల్పడితే పోలీసు కేసులు నమోదై జీవితం పాడవుతుందని హెచ్చరించారు. విద్యార్థులు ర్యాగింగ్ నిరోధక ప్రతిజ్ఞను చేశారు. న్యాయవాది రాజేష్, అధ్యాపకులు వెంకటకృష్ణయ్య, సుజన, శ్రీదేవిలు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి

వడమాలపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ గణపతి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా మంగళవారం అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వినాయకుడికి అర్చన, గెరిగతో సిందూర జలాభిషేకం, విభూదితో భస్మాభిషేకం నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించారు. శని ప్రభావం ఉన్న వారితో అర్చనలు చేయించారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది.

సచివాలయం సేవల్లో నిర్లక్ష్యం

సమయపాలన పాటించని వైనం ● మున్సిపల్ కమిషనర్‌కు ప్రజల ఫిర్యాదు

పుత్తూరు అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని సచివాలయాలు సమయపాలన పాటించడం లేదు. ఉదయం 11 గంటలకు కూడా కార్యాలయ తలుపులు తెరుచుకోని పరిస్థితి. వివిధ సేవల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు సిబ్బంది నుంచి నిర్లక్ష్యం ఎదురవుతోంది. ప్రజలకు సత్వరంగా సేవలందించడానికి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ సిబ్బంది పనితీరుతో మసకబారుతోంది. వీధి లైట్లు, ఇంటి పన్ను మదింపు తదితర సమస్యలపై ఫిర్యాదు చేసి రోజులు గడుస్తున్నా సిబ్బంది నుంచి ఎటువంటి సమాధానం రావడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఎన్జీవో కాలనీలోని సచివాలయ సిబ్బందిపై ప్రజలు మున్సిపల్ కమిషనర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ సదరు సచివాలయం సిబ్బందిని మందలించినట్లు సమాచారం.


11 గంటలైనా తెరుచుకోని ఎన్జీవో కాలనీ సచివాలయం

ఆశా కార్యకర్తల సంబరాలు

పుత్తూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యకర్తలకు పూర్తి జీతంతో ఆరు నెలల ప్రసూతి సెలవులు, పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లుగా నిర్ణయించడం, పదవీ విరమణ సమయంలో లక్షా యాభై వేల రూపాయల మంజూరుపై ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన సింగిల్ విండో అధ్యక్షులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సింగిల్ విండో అధ్యక్షులుగా నామినేటెడ్ పదవులు పొందిన వారు ఎమ్మెల్యే సుధీర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు మంగళవారం ఊరందూరులోని ఆయన స్వగృహంలో కలిసి ముందుగా సత్కరించారు. అనంతరం ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డును బాగు చేయండి... సారూ!

శ్రీకాళహస్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దక్షిణ కైలాస్‌నగర్ కాలనీ నుంచి కొత్తపేట టింబర్ డిపో వరకు ఉన్న లింకు రోడ్డును బాగు చేయండి సారూ అంటూ స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇది లోతట్టు ప్రాంతం కావడంతో చిన్న పాటి వర్షానికి రోడ్డుపై నీరు చేరతోంది. అంతేకాకుండా పెద్ద ఎత్తున గోతులతో మడుగులుగా మారుతోంది. ఈ మార్గంలో పెద్ద ఎత్తున వాహనదారులు, పాఠశాలలు, విద్యార్థులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. పట్టణ ప్రాంతం కావడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు సమస్యపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.


అధ్వానంగా ఉన్న దక్షిణ కైలాస్‌నగర్ కాలనీ రోడ్డు

అంబరాన్నంటిన జాతర సంబరం


బంగారు కవచంతో భక్తులకు దర్శనమిచ్చిన గంగమ్మ - సారె సమర్పించడానికి వస్తున్న ఎమ్మెల్యే - గుడిలో రద్దీ

రేణిగుంట ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): భక్తుల కోరిక తీర్చే గంగమ్మ తల్లి జాతర అంబరా న్నంటింది. మంగళవారం రేణిగుంట గంగమ్మ జాతరని పురస్కరించుకుని పట్టణవాసులు ఆలయానికి పోటెత్తారు. ఉదయం ఇళ్ల వద్ద అంబళ్లు పోశారు. నడివీధి త్రిశూలం వద్ద గంగమ్మకు నైవేద్యం సమర్పించారు. రాత్రి వరకు భక్తులు గంగమ్మ ఆలయానికి చేరుకుని పొంగలి వండి అమ్మవారికి సమర్పించారు. ఇక పట్టణంలో ఎక్కడ చూసినా జాతర సందడి కనిపించింది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గంగమ్మను ఎమ్మెల్యే సుధీర్, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం దర్శించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరా ద్వారా పోలీసులు పర్యవేక్షించారు.

స్వాతంత్ర్య దిన పరేడ్‌కు కేజీబీవీ విద్యార్థులు

కేవీబీపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఈనెల 15న తిరుపతి పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న 79వ స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌కు ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించి జిల్లా చీఫ్ కమిషనర్ కేవీఎన్ కుమార్ ఆదేశాల మేరకు వీరిని ఎంపిక చేసినట్లు ఎస్వో సుకన్య తెలిపారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాయింట్ సెక్రటరీ పుష్పా, పీఈటీ సతీసావిత్రి విద్యార్థులతో పాల్గొంటారు.

బోర్డు పెట్టారు సరే.... భూముల్లోకి వెళ్లేందుకు దారేది?



సత్యవేడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం అడవికొడియం బేడులో వివాదంలో ఉన్న గ్రామకంఠం స్థలాన్ని ఆక్రమించరాదంటూ రెవెన్యూ అధికారులు బోర్డుపెట్టి చేతులు దులుపుకున్నారని అయితే తన భూముల్లోకి వెళ్లేందుకు దారి చూపడం లేదని మహిళా రైతు దమయంతి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు డేవిడ్‌రాజ్ గ్రామకంఠం భూములను ఆక్రమించుకుని భవనం, కాంపౌండ్ నిర్మించుకున్నాడన్నారు. దీంతో తన పట్టా పొలంలోకి వెళ్లేందుకు దారి లేకుండా పోయిందని, ఆక్రమణ తొలగించాలని పీజీఆర్ఎస్‌లోనూ, మంత్రి లోకేశ్ సత్యవేడు పర్యటనలో వినతులు సమర్పించానని తెలిపారు. అయితే రెండు నెలలుగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆక్రమణ దారుడితో కుమ్మక్కై పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ విషయమై ఇటీవల పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారులు హుటాహుటినా గ్రామానికి వచ్చి ఆక్రమణ స్థలంలో బోర్డు నాటి వెళ్లిపోయారని తెలిపారు. తన పొలానికి దారి చూపకుండా సమస్యను అలాగే వదిలేశారని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

అనారోగ్యంతో ఇరిగేషన్ ఏఈ మృతి

ఏర్పేడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేట ఇరిగేషన్ సెక్షన్ ఏఈ చినబాబు (55) మంగళవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న చినబాబు చికిత్స తీసుకుంటూ ఆస్పత్రిలో మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు.

బీజేపీ రాష్ట్ర చీఫ్‌కు సన్మానం

పిచ్చాటూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బాధ్యతలు స్వీకరించిన తరువాత తిరుపతిలో సారథ్య ర్యాలీలో పాల్గొనడానికి విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను పిచ్చాటూరు మండల బీజేపీ అధ్యక్షుడు ఎన్. కుబేంద్రన్ శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయినుంచి పార్టీ పటిష్టానికి అంకితభావంతో పని చేయాలని సూచించి నట్లు కుబేంద్రన్ తెలిపారు.



ఘనంగా ఆడి పొంగళ్లు

శ్రీకాళహస్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాజెక్టు వీధిలో మంగళవారం ఘనంగా ఆడి పొంగళ్ల మహోత్సవం జరిగింది. ముందుగా ప్రాజెక్టు వీధిలోని గంగమ్మకు విశేష అభిషేకాలు పూజలు నిర్వహించారు. అనంతరం కలశ జలాలను ఊరేగించారు. ఆతర్వాత భక్తిశ్రద్ధలతో పొంగలిని నైవేద్యంగా సమర్పించారు.

పార్టీ లైన్ దాటితే చర్యలు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్

సత్యవేడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) నియోజకవర్గంలో గందరగోళం సృష్టించి పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ హెచ్చరించారు. నియోజకవర్గంలో గత కొద్ది రోజులుగా పార్టీలో పరిణామాలపై ఆయన స్పందించారు. ఈ మేరకు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పిచ్చాటూరులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... క్రమశిక్షణకు మారు పేరైన టీడీపీలో సొంత అజెండాతో పనిచేస్తే చర్యలు తప్పవన్నారు. కులాలను అడ్డం పెట్టుకుని పార్టీలో ఇబ్బందులు సృష్టించాలని చూస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధి పట్ల ఆకర్షితులై పార్టీలోకి వచ్చిన వారిని స్వాగతిస్తామన్నారు. అదే సమయంలో పార్టీలో నాయకులు, కార్యకర్తలతో చర్చించి అందరికీ ఆమోద యోగ్యమైన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. పార్టీకోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. కొత్తగా వచ్చిన వాళ్లకు అప్పుడే పదవులు ఇవ్వ బోమన్నారు. త్వరలో భర్తీ చేయనున్న పార్టీ కమిటీలు, నామినేటెడ్ పదవుల్లో సీనియర్ నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. శంకర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతంతో పాటు అభివృద్ధి చేయడమే తన ప్రధాన కర్తవ్య మన్నారు. పార్టీలో విబేధాలకు తావు లేకుండా సమన్వయంతో ముందుకు సాగుదామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్

భానుప్రకాష్ రెడ్డికి ఎమ్మెల్యే సుధీర్ పరామర్శ

శ్రీకాళహస్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పాలక మండల సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డిని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ పరామర్శించారు. ఇటీవల భానుప్రకాష్ రెడ్డి తల్లి అరుణమ్మ మరణించారు. ఈక్రమంలో తిరుపతిలోని భానుప్రకాష్ స్వగృహానికి మంగళవారం ఎమ్మెల్యే సుధీర్ చేరుకుని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. భానుప్రకాష్‌రెడ్డిని పరామర్శించి సానుభూతి తెలిపారు.



అవయవదానంపై అవగాహన

రేణిగుంట ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అవయవదానంతో మరో వ్యక్తికి జీవితాన్ని ఇచ్చినట్టేనని అమరా హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ప్రసాద్ గొరినేని, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి అన్నారు. మండలంలోని కరకంబాడి సమీపంలో ఉన్న అమరా హాస్పిటల్‌లో జాతీయ అవయవదానం దినం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అవయవ దానం ప్రాముఖ్యతను వివరించారు. అపోహలు, వాస్తవాలపై ప్రత్యేక సెషన్ నిర్వహించారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందితో అవయవ దానంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో శంకర్, శివపార్వతి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ ప్రసాద్ గొరినేని

పార్టీలకతీతంగా మెలిగిన చెంచురెడ్డి

శ్రీకాళహస్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలకు అతీతంగా మాజీ ఎమ్మెల్యే చెంచురెడ్డి అందరి మనసుల్లో స్థానం సంపాదించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథ రెడ్డి అన్నారు. చెంచురెడ్డి భౌతిక కాయానికి మంగళవారం పలువురు నివాళులర్పించారు. ఇందులో భాగంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథ్‌రెడ్డి పూలమాలవేసి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పెంచలయ్య, నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, పట్టణ కార్యదర్శి గోపి తదితరులు పాల్గొన్నారు. కాగా మాజీ ఎమ్మెల్యేలు భూమన కరుణాకరరెడ్డి, బియ్యపు మధుసూదన్ రెడ్డి, ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు సహా పలువురు వైసీపీ నాయకులు కూడా నివాళులర్పించిన వారిలో ఉన్నారు.


చెంచురెడ్డికి నివాళులర్పిస్తున్న భూమన తదితరులు

సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం ప్రారంభమైన సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలను ఎంఈవో మునిసుబ్రమణ్యం పరిశీలించారు. కల్లివెట్టు, నెలవాయి ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం నుంచి సరికొత్తగా ప్రభుత్వం అందించిన మూల్యాంకనం పుస్తకాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యా సంవత్సరానికి సంబంధించి అన్నీ పరీక్షలు ఒకే పుస్తకంలో విద్యార్థులు రాసేలా పంపిణీ చేశామన్నారు.

నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేయండి


సమావేశంలో మాట్లాడుతున్న గౌరీశంకర్

వరదయ్యపాళెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకుని నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ గౌరీశంకర్ తెలిపారు. మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో అటల్ టింకరింగ్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గౌరీశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు అటల్ టాంకరింగ్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. త్రీడీ ప్రింటింగ్, మెకానికల్ టూల్స్, కోడింగ్ డిజైన్ లో పట్టు సాధించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో పీఎంశ్రీ కింద చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఏఎంవో శంకరయ్య, ఏఎస్‌వో సారథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవాంగులకు సముచిత స్థానం కల్పించండి

వరదయ్యపాళెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో దేవాంగులకు సముచిత స్థానం కల్పించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను వరదయ్యపాళెంకు చేనేత సంఘం నాయకుడు, డీవీఎంసీ సభ్యుడు గుత్తి త్యాగరాజు కోరారు. తిరుపతిలో జరిగిన సారథ్యం సభకు విచ్చేసిన మాధవ్‌ను త్యాగరాజు మర్యాద పూర్వకంగా కలిసి రాట్నాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని దేవాంగులకు సామాజిక, రాజకీయ రంగాల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలి కోరారు. కేంద్రప్రభుత్వం చేనేతలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని మాధవ్ తనకు సూచించినట్లు తెలిపారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించండి: ఎన్ఎంయూ

సత్యవేడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సత్యవేడు ఆర్టీసీ డిపో ఆవరణలో మంగళవారం ఉదయం ఎన్ఎంయూ నాయకులు నిరసన తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు టీ విరామ సమయంలో ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి చెంచలయ్య ఆధ్వర్యంలో డిపో, గ్యారేజ్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో ధర్నా నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో డిపో చైర్మన్ టి.సుదాకర్, గ్యారేజ్ కార్యదర్శి ఎస్.శేఖర్, డిపో ట్రెజరర్ యుగంధర్, బాషా తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతులకు ఉత్సవ గొడుగుల వితరణ

శ్రీకాళహస్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వరుడికి ఉత్సవ గొడుగులను తమిళనాడుకు చెందిన శ్రీమత్ రామానుజ కైంకర్య ట్రస్టు నిర్వాహకులు వితరణ చేశారు. ఈ మేరకు మంగళవారం గొడుగులను మంగళవారం ఎమ్మెల్యే సుధీర్‌కి అందజేశారు. ఇంకా ఆలయ అధికారులు కొలతల వివరాలు ఇస్తే పరివార దేవతామూర్తులకు సైతం గొడుగులు అందజేస్తామన్నారు.